Follow: @ANNTELUGU
27-01-2025
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 56 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రాజ్యాంగ లక్ష్యాలను నెరవేర్చాలి

**అంబేద్కర్ భావాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**నెక్లెస్ రోడ్డు వేదికగా భారతమాత మహా హారతి**

**పాల్గొన్న గవర్నర్ విష్ణుదేవ వర్మతోపాటు ప్రముఖులు**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ లక్ష్యాలను మనమందరం నెరవేర్చాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భారతమాత మహారథి కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ వర్మ, సంగీత దర్శకుడు ఆస్కార్ అవార్డ్ గ్రహీత ఎంఎం కీరవాణి, ఈ సంవత్సరం పద్మశ్రీ అవార్డుకు కేంద్ర ప్రభుత్వం చే గుర్తించబడిన మాడుగుల నాగఫణి శర్మ, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్, విశ్వేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డితో కలిసి ఆయన కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 'భారతమాత అంటే సర్వస్వరూపి సమదృష్టి అని అర్థం. అంబేద్కర్ ఈ ఆలోచనకు పెద్దపీట వేసి మనకి రాజ్యాంగాన్ని అందించారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### నాలుక దగ్గర పెట్టుకుని మాట్లాడాలి

- బండి సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ స్టాండ్ చెప్పాలి
- మా హక్కులు మాకు రాకపోతే బాజాప్తా పోరాటం చేస్తాం
- ఎవరైనా మిస్ అయితే మమ్మల్ని అడుగు కేటీఆర్
- మంత్రి పొన్నం ప్రభాకర్



02

### ఇచ్చిన మాట నెరవేరుస్తున్న సీఎం రేవంత్

- పిల్లిశాపాలకు ఉట్టి తెగిపడ్తదా?
- బీఆర్ఎస్ నాయకుల వైఖరిని దుయ్యబట్టిన బోరెడ్డి అయోధ్యరెడ్డి
- అవరోధాలు ఎన్ని ఉన్నా నాలుగు పథకాల అమలు ప్రారంభం



02

### సంజయ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నా

- ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం
- రాష్ట్రాల హక్కులను హరించడమే
- రాజ్యాంగ విలువలను తుంగలోకి తొక్కుతున్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



03



హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు

### దక్షిణ భాగంపై కీలక అప్డేట్

- కన్సల్టెన్సీ కోసం టెండర్ పిలిచిన సర్కార్

03



### బీఆర్ఎస్ ఆరోపణల్లో పసలేదు

- పదేళ్ల పాలనలో ఒరగబెట్టింది ఏమీలేదు
- ఆహారభద్రతకు పెద్దపీట వేస్తున్నాం
- పథకాల అమలుకు కట్టుబడి ఉన్నాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

03



### హుస్సేన్ సాగర్ బాణాసంచా ప్రమాదం

- రెండు బోట్లు దగ్ధం
- బోట్లలో చిక్కుకున్న ఏడుగురు
- ముగ్గురికి తీవ్ర గాయాలు

03

# త్రివర్ణ పతాక రెపరెపలు

## వైభవంగా 76వ గణతంత్ర దినోత్సవం

కర్తవ్యపథ్‌లో జాతీయజెండా ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

జాతీయజెండాలతో ఎగిరిన హెలికాప్టర్లు.. ప్రత్యేక ఆకర్షణగా ప్రదర్శన

పదివేల మంది ప్రత్యేక అతిథులు

**మన రాజ్యాంగ విలువలను ఈ వేడుక కాపాడుతుంది: ప్రధాని మోదీ** 03

**ఢిల్లీ, మహా:** దేశవ్యాప్తంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఢిల్లీలోని కర్తవ్య పథ్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము త్రివర్ణ పతాకం ఎగురు వేశారు. త్రివిధ దళాల సైనిక వందనం స్వీకరించారు. ఈ సారి గణతంత్ర వేడుకలకు ముఖ్యఅతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రభావో సుబియాంటో హాజరయ్యారు.. గణతంత్ర వేడుకల్లో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఢిల్లీలోని విధి మార్గంలో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో భారతదేశం తన శక్తిని, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిస్తుంది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా భారతదేశం స్వాతంత్ర్య, రాజ్యాంగ నిర్మాణం, ఐక్యత, ప్రజాస్వామ్య విలువలను గుర్తు చేస్తుంది.

మిగతా 2లో





## రైతుకు, కాంగ్రెస్‌కు ఉన్నది

# భూమికి విత్తుకు ఉన్న సంబంధం

**ప్రతిష్టాత్మకమైన నాలుగు పథకాలను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి**

### లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

సాగు ఖర్చులు పెరిగడంతో రైతు భరోసా పెంచాం

రేషన్ కార్డు దారులకు త్వరలోనే సన్న బియ్యం

భూమి లేని రైతులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

రేషన్ కార్డులు రాని వారు బాధపడొద్దు

ఇంటింటికీ వచ్చి సర్వే చేసి ఇస్తారు

చంద్రవంచలో సీఎం రేవంత్ రెడ్డి

**నారాయణపేట, మహా :** రైతును రాజుగా చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని, రైతుల కోసం ఎన్ని త్యాగాలకైనా ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భూమికి, విత్తుకు ఎలా అనుబంధం ఉంటుందో రైతుకు, కాంగ్రెస్‌కు మధ్య అలాంటి సంబంధం ఉందన్నారు. ఈ దేశంలో రైతుల కోసం ఏదైనా పథకం ప్రారంభించిందంటే అది కాంగ్రెస్ పార్టీ నుంచే మొదలవుతుందన్నారు. నాలుగు ప్రతిష్ఠాత్మక పథకాలకు సీఎం రేవంత్ రెడ్డి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీకారం చుట్టారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభించారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి నాలుగు పథకాలను ప్రారంభించి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన రూ. 11.80 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు.

మిగతా 2లో

# కాస్కో కేటీఆర్..!

## నువ్వు నీ పార్టీ కొట్టుకపోవడం ఖాయం

మీరెన్ని కుట్రలు చేసినా సంక్షేమ పథకాలు ఆగవ్

సంక్షేమ పథకాలకు రూ.45 వేల కోట్ల భారం

సంపదను సృష్టించి ప్రతి పైసా పేదలకు పంచుతాం..

ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు ఇస్తాం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

03



## ప్రశ్నిస్తే రక్తాలు వచ్చేలా కొడుతారా..?

### పోలీసులు నిరంకుశంగా దాడి చేస్తున్నారు

జనగామ లాఠీచార్జ్‌పై స్పందించిన హరీశ్‌రావు

పల్లాను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం.. సోషల్ మీడియాలో పోస్ట్





వివరాలు 3లో

**కార్టూ 'నిజం'**





## పాడె మోసిన కంది శ్రీనివాసరెడ్డి

**సహాయకుడి తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్న నేత**

**కష్టాల్లో ఓదార్పు.. అండగా ఉంటానని అభయం**

03





03

రైలు పట్టాలతో వెళ్తున్న

## లారీ బోల్తా

ఐదుగురు మృతి

## దేశ సమగ్రత కాంగ్రెస్‌తోనే సాధ్యం

- రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర
- అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించారు
- ఇందిరను బండి సంజయ్ అవమానించారు
- మహనీయులను అవమానించిన నేతలను ప్రజలు క్షమించరు
- మండిపడ్డ టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- గాంధీభవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్, మహా:** ప్రపంచ దేశాలు మెచ్చిన భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని టీ.పీసీసీ చీఫ్ బీ.మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. హైదరాబాద్ గాంధీ భవన్ లో రిపబ్లిక్ డే వేడుకలలో జాతీయ పతాకాన్ని మహేశ్ కుమార్ గౌడ్ ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావాలని.. తద్వారా కాషాయ ఎజెండాను అమలు చేయాలని బీజేపీ పాలకులు చూస్తున్నారన్నారు. పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ ను కేంద్ర హోం మంత్రి అవమానించారని, ప్రధాని మోడీ వంత పాడారని విమర్శించారు.

మిగతా 2లో

## రైతుకు, కాంగ్రెస్‌కు ఉన్నది

# భూమికి విత్తుకు ఉన్న సంబంధం







(మొదటిపేజీ తరువాయి)

734 మందికి రైతు భరోసా చెక్కులను రేవంత్ పంపిణీ చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున నాలుగు సంక్షేమ పథకాలు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. సాగు ఖర్చులు పెరిగాయని రైతు భరోసా నిధులు పెంచామన్న రేవంత్ రెడ్డి ఏడాదికి ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతు భరోసా ఇస్తామని పేర్కొన్నారు. ఇవాళ ఆదివారం కావడంతో రైతు భరోసా డబ్బులు జమకావన్న సీఎం, అర్ధరాత్రి 12 దాటగానే రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ అవుతాయని వివరించారు. భూమి లేని వారిని కూడా ఆదుకోవాలని గతంలో కూలీలు అడిగారని, వారి కోసం ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను తీసుకువచ్చామని రేవంత్ వివరించారు. కూలీ పని చేసే పేదలకు ఆ పథకం కింద రూ.12 వేలు ఇస్తున్నామని తెలిపారు. దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్ ఒక్క సంతకంతో దేశమంతటా రుణమాఫీ చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రంలో ఒకే విడతలో రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్లుగా ఆయన పేర్కొన్నారు. అలా చేసిన రాష్ట్రం మరొకటి లేదని వివరించారు. 25.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లు జమ చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగాలేకపోయినా రైతు సంక్షేమం కోసం కొన్ని త్యాగాలకు సిద్ధపడి రైతు రుణ మాఫీ చేశామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నో హామీలు నెరవేర్చామని రేవంత్ రెడ్డి వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెరవేరుస్తున్నామని, రైతు రాజ్యం ఇది అని నిరూపించేందుకు సిద్ధపడ్డామన్నారు. రైతులకు ఉచిత కరెంట్‌ను మొదట అమలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు. దేశమంతటా రైతులకు రుణమాఫీ చేసింది కూడా కాంగ్రెస్ సర్కారేనని పేర్కొన్నారు.

### చౌక ధరల దుకాణాల్లో సన్న బియ్యం

రేషన్ కార్డు ఉన్న పేదలకు త్వరలోనే సన్న బియ్యం అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గత దశాబ్ద కాలంలో పేదలకు ప్రభుత్వ ఇళ్లు రాలేదన్న రేవంత్ రెడ్డి, పదేళ్ల కాలంలో గ్రామాల్లో ఎవరికైనా రెండు పడక గదుల ఇల్లు వచ్చిందా? అని సీఎం ప్రశ్నించారు. పేదలు ఇంటిని నిర్మించుకుంటే రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు రేషన్‌కార్డులు ఇవ్వలేదని రేవంత్ మండిపడ్డారు. పేదలంతా ఎక్కడ ఉన్నా రేషన్ కార్డు తీసుకోవాలని కోరారు. రేషన్ కార్డు రాలేదని ఎవరూ బెంగపడొద్దని, కార్డుల జారీ ప్రక్రియకు గడువు లేదన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ సభల ద్వారా రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించామన్న ఆయన, గ్రామాలకు అధికారులను ఇళ్లకు పంపిస్తున్నామని వివరించారు. గతంలో ఏదైనా కావాలంటే ఎవరైనా ఫామ్‌హౌజ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గ్రామాల్లో ప్రజల సమక్షంలోనే లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లుగా వివరించారు. ప్రభుత్వమే ప్రజల వద్దకు వచ్చి దరఖాస్తులను తీసుకుంటుందని ఆయన వివరించారు. మాది ప్రజా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉంటుందన్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే ఎప్పటికీ వెనక్కి తగ్గదని పేర్కొన్నారు. తెలంగాణ ఇస్తామని సోనియా గాంధీ చెప్పారని, ఇచ్చారని వివరించారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉండి పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. రూ.లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలిందని మండిపడ్డారు. కాళేశ్వరం కూలిపోయినా ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగిందని వివరించారు. రేషన్ కార్డులు రాలేదని దొంగ ఏడుపులు ఏడుస్తున్న కొంత మంది అధికారంలో 10 సంవత్సరాలు ఉన్నా ఎందుకు ఇవ్వలేదన్న విషయ..ాన్ని ప్రజలకు చెప్పాలన్నారు. డబుల్ బెడ్ రూంలను కట్టి పేదలకు ఇవ్వకుండా ఎందుకు నాటకాలాడారో స్పష్టం చేయాలన్నారు. మాటల గారడీతో ప్రజలను పదేళ్ళు మభ్యపెట్టిన కొంత మంది ఇప్పుడు ప్రజలకు ఏం చేయడం లేదంచూ దొంగ ఏడుపులు ఏడుస్తున్నరని విరుచుకుపడ్డారు. మేం చెప్పింది చేస్తున్నాం, అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

# వీడిన మాధవి మర్డర్ మిస్టరీ

**మాంసం ముద్దలను ఉడికించింది కుక్కర్‌లో కాదు.. ఏకంగా పొటాషియం హైడ్రాక్సైడ్‌తో**

**హతుడికి వివాహేతర సంబంధముందని గుర్తించిన పోలీసులు**



**హైదరాబాద్, మహా :** తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన మీర్‌పేట మాధవి హత్య కేసులో తాజాగా సంచనల విషయాలు వెలుగులోకి వచ్చాయి. మాజీ సైనికుడైన గురుమూర్తి తన భార్యను దారుణంగా హత్య చేయడమే కాకుండా అత్యంత పాశవికంగా శరీర భాగాలను ఉడికించి మరీ మృతదేహం ఆనవాళ్లు లేకుండా చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో పోలీసులు మరింత లోతుగా విచారించగా ఒళ్లు గగుర్పొడిచే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. కేసు నుంచి ఎలాగైనా తప్పించుకోవడానికి నిందితుడు మృతదేహం భాగాలను కుక్కర్‌లో కాకుండా హీటర్ సాయంతో విడతల వారీ ఉడికించాడని తెలిసింది. ఇందుకోసం అతను పొటాషియం హైడ్రాక్సైడ్ వాడినట్లు పోలీసులు గుర్తించారు.

మాధవి మర్డర్ కేసు రాష్ట్రంలోనే అరుదైన కేస్‌గా పోలీసులు తేల్చారు. ఈ కేసులో ఆధారాలను సేకరించేందుకు పోలీసులు అత్యాధునిక టెక్నాలజీ వాడారు. నిందితుడు గురుమూర్తి తన భార్యను దారుణంగా హత్య చేయడమే కాకుండా మృతదేహాన్ని మాయం చేసేందుకు ఎంతో తెలివిగా ప్లాన్ చేశాడు. మృతదేహాన్ని ముక్కలుగా నరికిన తర్వాత వాటిని ఉడికించడానికి పొటాషియం మైడ్రాక్సైడ్ ద్రావణం సాయంతో ఉడికించాడు. అలాగే మృతదేహాన్ని నరికేందుకు కత్తి, చెక్క, మొద్దును కూడా వినియోగించాడని తెలిసింది. అయితే వీటిని ఎక్కడి నుంచి తీసుకొచ్చాడనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. నిందితుడు గురుమూర్తికి మాధవి బంధువుల అమ్మాయితో వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఇటీవల వారి బంధువుల ఇంట్లో జరిగిన వేడుకల్లో అత్తమామలు వ్యవహరించిన తీరు గురుమూర్తికి మరింత కోపం తెప్పించినట్లు తెలుస్తోంది. వివాహేతర సంబంధంతో పాటూ అత్తమామలు చేసిన అవమానం మనసులో పెట్టుకున్న అతను తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలోనే సంక్రాంతి పండుగ చేసుకునేందుకు భార్య, పిల్లలతో కలిసి గురుమూర్తి నగరంలోని తన సోదరి ఇంటికి వెళ్లాడు. పిల్లలకు సెలవులు కావడంతో అక్కడే వదిలేసి జనవరి 14న భార్యను తీసుకుని ఇంటికి వచ్చాడు. ఆ మరుసటి రోజు రాత్రి భార్యతో గొడవపడిన గురుమూర్తి ఆగ్రహంతో తలపై బలంగా బాదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

భార్య చనిపోయిందని నిర్ధారించుకున్న గురుమూర్తి ఎలాగైనా ఈ కేసు నుంచి బయట పడేందుకు మృతదేహం ఆనవాళ్లు లేకుండా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో రాత్రంతా యూట్యూబ్‌లో వీడియోలు చూసి జనవరి 16న మృతదేహాన్ని బాత్రూంలోకి తీసుకెళ్లి ముక్కలు చేశాడు. ఆ రోజంతా అదే పనిలో ఉన్న నిందితుడు రాత్రి వాటిని బకెట్లో వేసి హీటర్‌తో ఉడికించాడు. ఇందుకోసం పొటాషియం మైడ్రాక్సైడ్ ద్రావణాన్ని వినియోగించాడు. ఎముకలను పొడి చేసిన తర్వాత దాన్ని బాత్రూం ఫ్లస్ ద్వారా డ్రైనేజీలోకి పంపించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ దారుణాన్ని అతను మూడు రోజుల పాటు చేసినట్లు తెలిసింది. ఆ సమయంలో ఇంటి యజమాని తన కుటుంబంతో సహా బెంగళూరులో ఉన్నాడు. అలాగే పిల్లలు కూడా ఇంట్లో లేకపోవడంతో ఈ ఘాతుకం బయటికి రాలేదు. మరోవైపు వివాహేతర సంబంధం పెట్టుకున్న యువతిని పెళ్లి చేసుకోవడం కోసమే ఇలా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆనవాళ్లు లేకుండా చేయడానికి నిందితుడు ఎంతగానో ప్రయత్నించినా కూడా మృతదేహాన్ని ముక్కలు చేసిన మొద్దు, గదిలోని వస్తువులపై మానవ అవశేషాలను పోలీసులు బ్లూరేస్ టెక్నాలజీ ద్వారా కనిపెట్టగలిగారు. అయితే మృతదేహాన్ని నరికేందుకు వాడిన మొద్దు, కత్తిని ఎక్కడ సేకరించారన్న అంశంపై పోలీసులు దృష్టి సారించారు.



## ఇచ్చిన మాట నెరవేరుస్తున్న సీఎం రేవంత్

- **పిల్లిశాపాలకు ఉట్టి తెగిపడ్తదా?**
- **బీఆర్ఎస్ నాయకుల వైఖరిని దుయ్యబట్టిన బోరెడ్డి అయోధ్యరెడ్డి**
- **అవరోధాలు ఎన్ని ఉన్నా నాలుగు పథకాల అమలు ప్రారంభం**

**హైదరాబాద్, మహా:** సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్కటిగా హామీలు అమలు చేస్తున్నారని సీఎం సీపీఆర్వో బోరెడ్డి అయోధ్య రెడ్డి ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. బాధ్యత ఉన్న నాయకుడు ఇచ్చిన మాటను గుర్తు చేసే దాకా ఆగరని.. ప్రజలకు మాట ఇచ్చారని..ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, గత బీఆర్ఎస్ పాలకులు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు తలకు మించిన అప్పుల పాపం నెత్తిన మోపినా.. రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటలు అన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తూనే ఉంటారని బోరెడ్డి పేర్కొన్నారు. అధికారం లేకుంటే ప్రజలు సంతోషంగా ఉండొద్దని కోరుకుంటున్న కురుచ, స్వార్థ నేతలకు జీర్ణం కాకపోయినా సరేనని..పిల్లి శాపాలకు ఉట్టి తెగిపడ్తదా..? అని బీఆర్ఎస్ నాయకుల వైఖరిని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ రెడ్డికి, తెలంగాణ కాంగ్రెస్ కు తెలంగాణ స్థిర అభివృద్ధి, సంక్షేమమే అంతిమం లక్ష్యమని గుర్తు చేశారు. ఆర్థిక పరమైన అవరోధాలు ఎన్ని ఉన్నా రిపబ్లిక్ డే నుంచి నాలుగు సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాలను అమలును సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని గుర్తు చేశారు.

# 2034 దాకా మేమే

**వచ్చే పదేళ్లలో మరిన్ని అద్భుతాలు.. కేంద్రం కుట్రలను అడ్డుకుంటాం**

**రాష్ట్రాల హక్కులు గుంజుకోవడం మంచిది కాదు**

**తెలంగాణకు కనీసం 5 పురస్కారాలు కూడా రాలేదు: సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, మహా:** తెలంగాణ సమాజం తమకు మరో పదేళ్లు అవకాశమిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే పదేళ్లలో మరిన్ని అద్భుతాలు సృష్టిస్తామని చెప్పారు. 20234 దాకా కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండబోతున్నదన్నారు. కేంద్రం కుట్రలను అడ్డుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అంబేద్కర్ వర్సిటీ లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ .. డిజిటల్ రిసోర్స్ సెంటర్ కు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణపై చర్చ జరగడం దురదృష్టకరమని, అంబేద్కర్ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు ఇదని.. కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తూ.. ప్రభుత్వ రంగ విద్యను నిర్వీర్యం చేస్తున్నారని సీఎం విమర్శించారు. నూతన యూజీసీ నిబంధనలపై పోరాడుతామని, రాష్ట్రాల హక్కులు గుంజుకోవడం మంచిది కాదని, కేంద్రం కుట్రలను అడ్డుకుంటామని అన్నారు. పద్మ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, వివక్ష కనిపించిందని, ప్రభుత్వం ప్రతిపాదించిన గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్న, జయధీర్ పేర్లను కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ ప్రజలకు అవమానమని, 139 మందికి పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్రం.. తెలంగాణకు కనీసం 5 పురస్కారాలు కూడా రాలేదని ఆరోపించారు. పద్మ అవార్డుల విషయంలో ప్రధాని మోదీకి లేఖ రాస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి**

నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో 15 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆష్కరించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వీసీ ఘంటా చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీలో నాలుగు కొత్త భవనాలు, ఆధునిక బస్ షెల్టర్ కు శంకుస్థాపన చేశారు.

# ఏచూరి లేని లోటును తీర్చాలి



- **వివక్షలపై నిరంతరం పోరాడాలి**
- **రాజ్యాంగం ప్రమాదంలో పడింది**
- **పరిణామాలు వేగంగా మారుతున్నాయి**
- **వాటన్నిటినీ తిప్పికొట్టాలి**
- **సీపీఎం నాయకుడు ప్రకాష్ కారత్**

**మహా:** కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, బీజేపీ నిర్ణయాలతో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, వాటిని తిప్పికొట్టాలంటూ సీపీఎం నాయకుడు ప్రకాష్‌కారత్ అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్ మండలం మల్కాపూర్ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో సీపీఎం తెలంగాణ రాష్ట్ర మహా సభలు ప్రారంభమయ్యాయి. ఈ మహా సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మహాసభల్లో సీతారాం ఏచూరి లేకపోవడం బాధాకరం అన్నారు. ఏచూరి లేని లోటును తీర్చాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందని ఆయన అన్నారు. రష్యా ఉక్రెయిన్, ఇజ్రాయిల్ పాలస్తీనా దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయని, భారత ప్రభుత్వం ఇజ్రాయెల్‌కి మద్దతిస్తుంది కానీ పాలస్తీనాని పట్టించుకోవడం లేదన్నారు. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయిన తరువాత రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయన్నారు. అన్ని దేశాలపై ఆధిపత్యం చెలాయించేందుకు అమెరికా కుయుక్తులు పన్నుతుందన్నారు. నూతన ఆర్థిక విధానాలు, సామాజిక అణిచివేత, కుల వివక్షపై పోరాడాలంటూ ఆయన పేర్కొన్నారు.

## రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలి

**సీజే జస్టిస్ సుజయ్ పాల్**

**హైదరాబాద్, మహా:** రాజ్యాంగాన్ని పక్కాగా పాటించడంతోపాటు రక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ అన్నారు. రాజ్యాంగ రూపకర్తలు ఎంతో కష్టపడి రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైకోర్టు ప్రాంగణంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచామన్నారు. హైకోర్టులో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామని వెల్లడించారు. 10 జిల్లా కోర్టుల్లో డిజిటలైజేషన్ చేశామని తెలిపారు. ఇటీవల హైకోర్టు, జిల్లా, తాలూకా కోర్టుల్లో కక్షిదారుల సౌకర్యార్థం మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

# నాలుక దగ్గర పెట్టుకుని మాట్లాడాలి

**బండి సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ స్టాండ్ చెప్పాలి**

**మా హక్కులు మాకు రాకపోతే బాజాప్తా పోరాటం చేస్తాం**

**ఎవరైనా మిస్ అయితే మమ్మల్ని అడుగు కేటీఆర్ : మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్, మహా:** ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని నాలుగు పథకాలను అమలు చేస్తున్నామంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం గాంధీ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రైతు భరోసా, ఉపాధి హామీ కూలీ లకు భరోసా, రేషన్ కార్డు పథకాలను ప్రారంభించాం. ప్రతిపక్ష పార్టీలు పథకాలపై ఎంత విష ప్రచారం చేసినా కాంగ్రెస్ కార్యకర్తలు వాటిని తిప్పికొట్టాలి. రాజ్యాంగం మీద అవగాహన లేకుండా చాలా మంది మాట్లాడుతున్నారు. అన్ని దగ్గర పెట్టుకుని మాట్లాడండి. తెలంగాణకు బీజేపీ అన్యాయం చేసింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధాని నుండి కేంద్రమంత్రుల వరకు అందరినీ కలిశాం. నిధులు విడుదల చేయాలని కోరాం. కానీ ఒక్క రూపాయి విడుదల చేయడంలేదు. అటల్ బిహారీ వాజ్ పేయి ఇందిరాను దుర్గామాతతో పోల్చారు. బండి సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ స్టాండ్ చెప్పాలి. దేశ ఐక్యత కోసం వారి కుటుంబం ప్రాణాలు అర్పించింది.

దీన్ దయాళ్, అటల్ పెన్షన్ యోజన, శ్యాం ప్రసాద్ ముఖర్జీ అంటూ వారిపేర్లతో పథకాలకు పెట్టారు. వాళ్ళంతా దేశం కోసం ప్రాణాలు వదిలారా..? రాష్ట్రానికి నిధులు రాకపోతే మీరు కేంద్ర పెద్దలను అడగడం లేదు. మా హక్కులు మాకు రాకపోతే బాజాప్తా పోరాటం చేస్తాం. ఇందిరమ్మ పేరు ఉంటే ఇళ్లు ఇవ్వమని ఎలా అంటారు..? ఇంకోసారి అంటే మంచిగా ఉండదు. మా నాయకుల గురించి మాట్లాడేటప్పుడు నాలుక దగ్గర పెట్టుకుని మాట్లాడాలి. సిరిసిల్ల, గజ్వేల్, సిద్దిపేట అర్హత కలిగిన వాళ్ళు ఎవరైనా మిస్ అయితే మమ్మల్ని అడుగు కేటీఆర్. ఇంత ఆర్థిక విధ్వంసం అయిన తరువాత కూడా అన్ని పథకాలను అమలు చేస్తున్నాం' అంటూ పొన్నం పేర్కొన్నారు.

ANN తెలుగు
# మహా పత్రిక
03
సోమవారం, హైదరాబాద్ | 27-01-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

# త్రివర్ణ పతాక రెపరెపలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి సంవత్సరం ఈ రోజు జరిపే వేడుకలు దేశ భక్తికి, సమాజాన్ని ఐక్యంగా ఉంచే ప్రేరణగా మారాయి. ణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎర్ర కోట నుంచి రాష్ట్ర పతిభవన్ వరకు సైనిక కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కవాతులో ఇండోనేషియా సైన్యం కూడా పాల్గొన్నది. కర్తవ్య పథ్ లో గణతంత్ర వేడుకల సంబురాలు అంబరాన్నంటాయి. కర్తవ్య పథ్ కు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ఇండోనేషియాకు చెందిన 352 మంది సభ్యుల కవాతు, బ్యాండ్ బృందం కూడా ఈ కవాతులో పాల్గొంది.

**స్వర్ణ భారతదేశం**

రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావడం ఈ సంవత్సరం వేడుకలకు ప్రధాన ఆకర్షణ. శకటాల ఇతివృత్తం 'స్వర్ణ భారతదేశం: వారసత్వం, అభివృద్ధి'. ఈ కవాతులో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 16 శకటాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల నుంచి 15 శకటాలు ప్రదర్శించబడ్డాయి. గణతంత్ర దినోత్సవ వేడుకలు ఈసారి చాలా ప్రత్యేకమైనవి. ఈసారి 10 వేల మంది ప్రత్యేక అతిథులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వీరిలో పారాలింపిక్ క్రీడాకారులు, ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన సర్పంచ్‌లు, చేనేత కళాకారులు, అటవీ సంరక్షణ కార్మికులు సహా పలువురు ఉన్నారు.

**యుద్ధస్మార్ చిహ్నాన్ని సందర్శించిన ప్రధాని మోదీ**

ప్రధాని మోదీ జాతీయ యుద్ధ స్మారక చిహ్నాన్ని సందర్శించి, అమరవీరులకు నివాళులర్పించారు. ఆయనతో పాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సైనిక అధికారులు కూడా హాజరయ్యారు. దేశం అమరవీరుల సేవను గుర్తిస్తూ, ప్రతి సంవత్సరం ఈ స్థలంలో నివాళులర్పించడం గొప్ప గౌరవంగా మారింది. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తన నివాసంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ వేడుకలో సాంఘిక సంస్థలు, కేంద్ర మంత్రిత్వ శాఖల నుంచి వివిధ శకటాలు ప్రదర్శించబడ్డాయి. ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవం మరింత ప్రత్యేకం ఎందుకంటే భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన 75 సంవత్సరాలను జ్ఞాపకం చేసుకుంటూ, దేశంలోని శక్తి, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేస్తున్నారు.



**హైలెట్ గా హెలికాప్టర్ల ప్రదర్శన**

2025 గణతంత్ర దినోత్సవ వేడుకలు ఢిల్లీ రాజ్‌పథ్‌లో (కర్తవ్య పథ్) ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచింది మాత్రం ఎంఐ హెలికాప్టర్ల ప్రదర్శన అని చెప్పవచ్చు. ఎందుకంటే 129 హెలికాప్టర్ యూనిట్‌కు చెందిన ఎంఐ5 హెలికాప్టర్లు కర్తవ్య పథ్ మీదుగా జెండాలతో ఎగిరి ఆకట్టుకున్నాయి. ఆ క్రమంలో ఆకాశంలో రంగురంగులను ప్రదర్శించి హెలికాప్టర్లు దేశభక్తి భావనను ప్రేరేపించాయి. వింగ్ కమాండర్లు శైలేందర్ సింగ్, రోహిత్ తివారీ, వినయ్‌ల నేతృత్వంలో కెప్టెన్ అలోక్ అహ్లావత్ గైడెన్స్‌లో ఈ ప్రత్యేక ప్రదర్శన జరిగింది. వారు హెలికాప్టర్లకు త్రివర్ణ పతాకాలని జోడించి వేడుకలకు మరింత శక్తి, ఉత్సాహాన్ని అందించారు. ఈ ప్రదర్శన గణతంత్ర దినోత్సవంలో భారతదేశం సైనిక శక్తి, సాంకేతికత, దేశభక్తి భావనలను చాటిచెప్పింది. హెలికాప్టర్లు చురుకైన పనితీరుతో అత్యంత నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ గగనతలంలో ఎగిరాయి. ఈ ప్రదర్శన మన దేశ సైనిక బలాన్ని, గౌరవాన్ని ప్రపంచానికి తెలియజేసిన ఒక అద్భుతమైన ఉదాహరణ అని చెప్పవచ్చు. ఈ హెలికాప్టర్లు భారతదేశ వివిధ రకాల సహాయక చర్యల్లో భాగస్వామ్యమవుతున్నాయి. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఈ ప్రదర్శన ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## మన రాజ్యాంగ విలువలను ఈ వేడుక కాపాడుతుంది

**రిపబ్లిక్ డే వేళ ప్రధాని మోదీ**

ఢిల్లీ, మహా: దేశ ప్రజలందరికీ ప్రధాని మోదీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ రోజు మనం మన అద్భుతమైన గణతంత్ర వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా మన అభివృద్ధి ప్రయాణం ప్రజాస్వామ్యం, గౌరవంతోపాటు ఐక్యతగా దేశ అభివృద్ధి ప్రయాణం సాగేలా మార్గాన్ని రూపొందించిన మహనీయులందరికీ నివాళులర్పిస్తున్నా. ఈ వేడుక మన రాజ్యాంగ విలువలను కాపాడుతుందని, బలమైన, సంపన్నమైన దేశాన్ని నిర్మించే దిశగా మన ప్రయత్నాలను బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నా అంటూ ఎక్స్ వేదిగా పోస్ట్ చేశారు.



# హుస్సేన్ సాగర్ బాణాసంచా ప్రమాదం

**రెండు బోట్లు దగ్ధం.. బోట్లలో చిక్కుకున్న ఏడుగురు .. ముగ్గురికి తీవ్ర గాయాలు**

హైదరాబాద్, మహా: తెలంగాణ రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న హుస్సేన్ సాగర్‌లోపల ఆదివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భారత్ మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా గ్రౌండ్స్‌లో భారత మాతకు మహా హారతి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు పటాకులు కాల్చడంతో హుస్సేన్ సాగర్‌లోని రెండు బోట్లకు నిప్పంటుకుంది. ఒక్కసారిగా వ్యాపించిన మంటలతో బోట్లు కాలి బూడిదయ్యాయి. కాగా, ప్రమాద సమయంలో పడవలలో ఏడుగురు నిర్వాహకులు చిక్కుకోగా.. వారిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు ధాటికి తీవ్ర గాయాలు కాగా, కళ్లకు ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి బోట్లలో మంటలను మంటలను ఆర్పివేశాయి. క్షతగాత్రులను హుస్సేన్ సాగర్ సమీపంలో ఉన్న గాంధీ ఆసుపత్రితోపాటు యశోద, సరోజినీ దేవి ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

# దేశ సమగ్రత కాంగ్రెస్‌తోనే సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

దేశం కోసం మాజీ ప్రధాని నెహ్రూ దేశం కోసం ఏండ్ల తరబడిగా జైలు జీవితం గడిపారని, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం బలిదానమయ్యారన్నారు. దేశం కోసం ప్రధాని మోడీ ఏ త్యాగం చేశారని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలకు ఇందిరమ్మ పేరు పెట్టవద్దంటూ మాజీ ప్రధాని ఇందిరమ్మ ను అవమానించేలా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడారని విమర్శించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగశీలి ఇందిరమ్మ అని, మీరు దేశం కోసం ఏం త్యాగం చేశారంటూ బీజేపీ నాయకులను ప్రశ్నించారు. దేశ సమగ్రత, పేదల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీహెచ్ సహా పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆరోపణల్లో పసలేదు



మహా: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్ అనవసర ఆరోపణలు చేస్తుందని, వారి ఆరోపణల్లో పసలేదని, పదేళ్ల పాలనలో వాళ్లు ఒరగబెట్టిందేమీలేదంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నాతాళ్లగూడెం గ్రామంలో నూతన సంక్షేమ పథకాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపి వారి జీవన ప్రమాణాలు పెంపొందించేలా సంక్షేమ పథకాలు అమలులోకి తెచ్చామన్నారు. చరిత్రలోనే ముందెన్నడూ లేని రీతిలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని నిరుపేదలకు సంవత్సరానికి రూ. 12 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు.

తెల్ల రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, చివరి లబ్ధిదారుడి అందేవరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అంతేగాకుండా ఉన్న రేషన్ కార్డుల లో అదనపు చేర్పులు కుడా కొనసాగుతాయన్నారు. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు మంజూరు చెయ్యలేదు గానీ, ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పసలేని ఆరోపణలతో ప్రజలను పక్కదోవ పట్టించేందుకే బీఆర్ఎస్ పూనుకుందని ఆయన విమర్శించారు. పారదర్శకంగా పనిచేస్తున్న ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.



# ప్రశ్నిస్తే రక్తాలు వచ్చేలా కొడుతారా..?

- పోలీసులు నిరంకుశంగా దాడి చేస్తున్నారు
- జనగామ లాఠీచార్జ్‌పై స్పందించిన హరీశ్‌రావు
- పల్లాను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం
- సోషల్ మీడియాలో పోస్ట్

హైదరాబాద్, మహా: రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. జనగామ జిల్లా ఎర్రగుంట తండాలో జరిగిన లాఠీచార్జ్‌ను ఆయన తీవ్రంగా ఖండించారు. లాఠీలు విరిగేలా, రక్తాలు వచ్చేలా పోలీసులు విరుచుకుపడటం దారుణమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్, 8 మంది వార్డు సభ్యులపైన పోలీసులు నిరంకుశంగా దాడి చేస్తున్నారని, ఇది హేయమైన చర్య అంటూ ఆయన మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమంటూ ఆయన ఆ పోస్టులో విమర్శించారు. ఇది ప్రజా పాలన కాదు, ప్రజాపీడనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమై, ప్రశ్నించిన ప్రతి ఒక్కరిపై అణచివేత రాజకీయాలు కొనసాగిస్తోందన్నారు. హామీలు అడిగితే లాఠీ చార్జ్, ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారన్నారు. ఎంతకాలం పోలీస్ పహారాలతో ప్రభుత్వం నడపాలనుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే అరెస్టు చేసిన ఎమ్మెల్యే, మాజీ సర్పంచ్, వార్డు సభ్యులను విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# రైలు పట్టాలతో వెళ్తున్న లారీ బోల్తా

**ఐదుగురు మృతి**

వరంగల్, మహా: వరంగల్ నగరంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మామునూరు వద్ద జరిగిన ప్రమాదంలో ఐదుగురు వలస కూలీలు మృతి చెందారు. మృతులు బిహార్‌కు చెందిన వాసులుగా పోలీసులు గుర్తించారు. మృతుల్లో మహిళతో పాటు చిన్నారి ఉన్నట్లు తెలిపారు. గాయపడిన క్షతగాత్రులను హుటాహుటిన ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కరీమాబాద్‌కు చెందిన సాగర్ అనే ఆటో డ్రైవర్‌కు రెండు కాళ్లు విరగ్గా, పూజ అనే మహిళ స్వల్పంగా గాయపడింది. ముఖేశ్ అనే మరో యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. లారీ వెనుక నుంచి 2 ఆటోలను బలంగా ఢీకొట్టి బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదం వరంగల్-ఖమ్మం రహదారిపై జరగడం, లారీ అడ్డంగా పడిపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. 3 క్రేన్‌ల సహాయంతో సుమారు రెండు గంటల పాటు శ్రమించి రహదారిపై చెల్లాచెదురుగా పడిన ఇనుప స్తంభాలను తొలగించారు. మృతదేహాలను శవ పరీక్షల నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. క్షతగాత్రులను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఎంజీఎం ఆసుపత్రిలో పరామర్శించారు. ఘటన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి నుంచి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

**సీఎం రేవంత్ దిగ్భ్రాంతి**

వరంగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులకు వెంటనే మెరుగైన వైద్య సాయం అందించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం ఆదేశించారు.

**ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం**

మరోవైపు బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సైతం వరంగల్ రోడ్డు ప్రమాద ఘటనపై స్పందించారు. మామునూరులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం ఎంతో దురదృష్టకరమని అన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ కన్నుమూత

**సీఎం రేవంత్, కేసీఆర్, హరీష్ దిగ్భ్రాంతి**



హైదరాబాద్: మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ జర్నలిస్ట్ ఆర్ సత్యనారాయణ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం సంగారెడ్డిలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా, టీజీపీఎస్సీ సభ్యుడిగా పనిచేశారు. 2007లో కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2008లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. టీఎస్‌పీస్సీ సభ్యుడిగా పని చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జర్నలిస్టుగా, ఎమ్మెల్సీగా, టీజీపీఎస్సీ సభ్యుడిగా తనదైన ముద్రవేశారన్నారు.

# సంజయ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నా

**ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం.. రాష్ట్రాల హక్కులను హరించడమే**

**రాజ్యాంగ విలువలను తుంగలోకి తొక్కుతున్నారు: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత**



హైదరాబాద్, మహా: కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తెలంగాణ సారస్వత పరిషత్‌లో భారత రాజ్యాంగం పై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. సంజయ్ మాట్లాడిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రి పదవిలో ఉండి మీకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వము అని బండి సంజయ్ మాట్లాడడం సరికాదన్నారు. ఇది రాష్ట్రాల హక్కులను హరించడమేనన్నారు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం పనితీరు ఉందంటూ కవిత మండిపడ్డారు. కింది స్థాయిలో పథకాలు అమలు చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలేనని ఆమె సంజయ్ కు గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని పట్టుకొని దేశమంతా తిరుగుతూ రాజ్యాంగాన్ని కాపాడాలని అంటున్నా రాహుల్ గాంధీని తెలంగాణకు స్వాగతిస్తున్నా.. తెలంగాణకు వచ్చి రాష్ట్రంలో రాజ్యాంగాన్ని కాపాడాలంటూ హితవు పలికారు. కొన్ని నెలల క్రితం ఆసిఫాబాద్‌లో మతకల్లోలాలు జరిగి వందలాది మంది నిరాశ్రులయ్యారని, వాళ్ల కోసం ఒక్క నాయకుడు కూడా మాట్లాడటంలేదన్నారు. ఆసిఫాబాద్‌లో నెలల తరబడి ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారని, ఇప్పటికీ ప్రభుత్వం నుంచి వాళ్లకు ఎలాంటి ఆర్థిక సహాయం గానీ నష్టపరిహారం కానీ అందలేదన్నారు. ప్రభుత్వ పెద్దలు కనీసం వాళ్లను పరామర్శించలేదంటూ కవిత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ విలువలని తుంగలో తొక్కుతున్నారంటూ కవిత మండిపడ్డారు.

# రాజ్యాంగ లక్ష్యాలను నెరవేర్చాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా సబ్కా సాత్ సబ్కా వికాస్ అనే నినాదంతో ముందుకు వెళ్తున్నారు. అలాగే సబ్ కా ప్రయాస్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ప్రధాని పిలుపునిచ్చారు. అంబేద్కర్ భావాన్ని మరింత ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉంది. భారత రాజ్యాంగ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రతి సంవత్సరం నెక్లెస్ రోడ్ వేదికగా 8వ సారి భారతమాత మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. దేశ భక్తిని పెంపొందించడమే ఈ భారతమాత మహారథి కార్యక్రమం ఉద్దేశం. అందరూ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉంది. నేటి తరానికి, భావితరానికి, నవతరానికి మన భారతదేశ గొప్పతనాన్ని తెలియజేయడం కోసమే మహా హారతి నిర్వహిస్తున్నాం.' అంటూ ఆయన పేర్కొన్నారు.

# ఏచూరి లేని లోటును తీర్చాలి

- వివక్షలపై నిరంతరం పోరాడాలి
- రాజ్యాంగం ప్రమాదంలో పడింది
- పరిణామాలు వేగంగా మారుతున్నాయి
- వాటన్నిటినీ తిప్పికొట్టాలి
- సీపీఎం నాయకుడు ప్రకాష్ కారత్



మహా: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, బీజేపీ నిర్ణయాలతో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, వాటిని తిప్పికొట్టాలంటూ సీపీఎం నాయకుడు ప్రకాష్ కారత్ అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్ మండలం మల్కాపూర్ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో సీపీఎం తెలంగాణ రాష్ట్ర మహా సభలు ప్రారంభమయ్యాయి. ఈ మహా సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మహాసభల్లో సీతారాం ఏచూరి లేకపోవడం బాధాకరం అన్నారు. ఏచూరి లేని లోటును తీర్చాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందని ఆయన అన్నారు. రష్యా ఉక్రెయిన్, ఇజ్రాయిల్ పాలస్తీనా దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయని, భారత ప్రభుత్వం ఇజ్రాయెల్‌కి మద్దతిస్తుంది కానీ పాలస్తీనాని పట్టించుకోవడం లేదన్నారు. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయిన తరువాత రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయన్నారు. అన్ని దేశాలపై ఆధిపత్యం చెలాయించేందుకు అమెరికా కుయుక్తులు పన్నుతుందన్నారు. నూతన ఆర్థిక విధానాలు, సామాజిక అణిచివేత, కుల వివక్షపై పోరాడాలంటూ ఆయన పేర్కొన్నారు.



## మందకృష్ణ మాదిగకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

**బాలకృష్ణ , నాగేశ్వరెడ్డికి ఎక్స్ వేదికగా అభినందనలు**

హైదరాబాద్, మహా: పద్మ అవార్డు గ్రహీతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. తెలంగాణ నుంచి జాతీయ అత్యుత్తమ పురస్కారాలు అందుకోబోతున్న డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్ రెడ్డి (పద్మవిభూషణ్), మందకృష్ణ మాదిగ (పద్మశ్రీ)కి శుభాకాంక్షలు చెప్పారు. వారితో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి పద్మభూషణ్‌కు ఎంపికైన ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ, కేఎల్ కృష్ణ, మాడుగుల నాగఫణి శర్మ, మిరియాల అప్పారావు, వద్దిరాజు రాఘవేంద్రాచార్యులకు అభినందనలు తెలిపారు.

# పాడె మోసిన కంది శ్రీనివాసరెడ్డి

**సహాయకుడి తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్న నేత**

**కష్టాల్లో ఓదార్పు.. అండగా ఉంటానని అభయం**



ఆదిలాబాద్ మహా : ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి జైనథ్ మండలం కొరటా గ్రామాన్ని సందర్శించారు.తన పీ.ఏ పాట్న అమూల్ తండ్రి పాట్న నడిపి నర్సింగ్ గుండెపోటుతో హఠాన్మరణం చెందిన వార్త విని దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు.ఆయన నివాసానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.కుటుంబానికి ధైర్యం చెప్పి ఓదార్చారు. అనంతరం శవయాత్రలో పాల్గొని భుజం మార్చి తన ఉద్యోగి కుటుంబం పట్ల గల అనుబంధాన్ని చాటుకున్నారు. అంత్యక్రియలకు హాజరై కడసారి వీడ్కోలు పలికారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు,మునిగేల విట్టల్,కౌన్సిలర్ గంద్రత్ రాజు,ఆదిలాబాద్ రూరల్ మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగన్న, నాయకులు రవి, రఫీక్, అంజద్ ఖాన్, అయాస్ పాల్గొన్నారు.

# సమాజానికి సాహిత్య చికిత్స



సాహిత్యం ఏమి చేస్తుంది? సమకాలీన సమాజాన్ని సవ్యమార్గంలో నడిపిస్తుంది. సాటి మనిషికి సాయంగా ఉండమని చెబుతుంది. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం కోరుతుంది. పీడితుల, బాధితులకు అండగా నిలబబడుతుంది. రోగగ్రస్థమైన సమాజానికి చికిత్స చేస్తుంది. అంతిమంగా అందరి హితం కోరుతుంది. ఇది థియరీ. ఇట్లా జరిగితే సంతోషం. ప్రాక్టికల్‌గా మాత్రం సమాజం ఇవ్వాళ ఇందుకు భిన్నంగా ఉన్నది. సాహిత్య సృజనా అదే రీతిలో ఉన్నది. ఇందుకు ప్రధాన కారణం యువత. వారికి అందుతున్న విద్య. కాసులు సంపాదించడమే విద్య యొక్క ఏకైక లక్ష్యమైతే, సమాజంలో నైతిక విలువలు శూన్యమవుతాయి. ఇవ్వాళ దేశంలో నెలకొన్న గందరగోళ పరిస్థితి ఇందుకు అద్దం పడుతుంది. టీనేజర్లను మర యంత్రాలుగా తయారు చేస్తున్న ఇంటర్మీడియట్ క్యాంపస్‌లు ఇందుకు సాక్ష్యం. యువతే ఎందుకు కారణమంటే దేశంలో అత్యధిక జనాభా వీరిదే!

సాహిత్యం సమాజాన్ని సెన్సిటైజ్ చేస్తుంది. కానీ ఈ సెన్సిటైజ్ చేసే సాహిత్యాన్ని సృజిస్తున్నది ఎంతమంది? అందులో యువత ప్రాతినిధ్యం ఎంత? ఇట్లా తెలుగులో సాహిత్య సృజనకారులెంతమంది? కనీసం పాఠకులు ఎంత శాతం అని ఆలోచించినట్లయితే నిరాశజనకమైన జవాబులు దొరుకుతాయి. ఎక్కడ సాహిత్య సమావేశం జరిగినా నలభై యేళ్ల పైబడిన వారే కనబడతారు. అందులో రిటైరైన వాళ్లే ఎక్కువగా ఉంటారు. యువకులు చాలా అరుదుగా కనబడుతూ ఉంటారు. గతంలో ఇట్లాంటి పరిస్థితి లేదు. 30 ఏండ్ల లోపే సురవరం ప్రతాపరెడ్డి గోలకొండ పత్రిక సంపాదకులుగా రాణించారు. దాదాపు వందేండ్ల కిందటే హైదరాబాద్‌కు చెందిన నందగిరి వెంకటరావు కేవలం 18 ఏండ్ల వయసులోనే చలంకు ధీటైన స్థాయిలో కథలు రాసిండు. ఈయన ఒక్కడే కాదు ఆ కాలంలో రచనలు చేసిన వారిలో చాలామంది యువకులు ఉన్నారు. అందులో నెల్లూరి కేశవస్వామి, భాస్కరభట్ల కృష్ణారావు తదితరులున్నారు. తమకు అవకాశాలు తక్కువగా ఉన్న సమయంలో కొత్తగా వాటిని సృష్టించుకున్నారు. వట్టికోట ఆళ్వారుస్వామి 1938లో కేవలం 23వ యేట 'దేశోద్ధారక గ్రంథమాల'ను హైదరాబాద్‌లో స్థాపించి భిన్న భావజాలాలకు సంబంధించిన రచనలను వెలువరించాడు. 'పరిసరాలు' పేరిట తెలంగాణ కథకుల సంకలనాలు వెలువరించాడు. అట్లాగే రామాయణంను విమర్శనాత్మక దృష్టితో పరిశీలించిన సురవరం ప్రతాపరెడ్డి 'రామాయణ విశేషములు'తో పాటు అనేక గ్రంథాలను వెలువరించాడు. సాహిత్యాన్ని రాజకీయోద్యమాలకు తోడుగా నిలిపిండు. పాఠకులను చౌరస్తాలో నిలబెట్టి ఎవరికి నచ్చిన మార్గం వారు ఎంచుకునేలా దారులు వేసిండు. 22`23వ యేటనే కాళోజి నారాయణరావు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన కవిత్వం రాసిండు. సభలు, సమావేశాలు నిర్వహించిండు. 20 ఏండ్లు నిండకుండానే గద్దర్ బుర్రకథలు చెప్పిండు. నాటకాలు వేసిండు. దాదాపు అంతే వయసులో బి.నరసింగరావు చిత్రకళ, నాటకాలు, కవిత్వం, ఫోటోగ్రఫీ ఇట్లా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచాడు. ఇదంతా గతం. ఇప్పుడు 30 ఏండ్ల లోపు యువత సాహిత్య, కళా రంగాల్లో సాధిస్తున్న ప్రగతి, చేస్తున్న కృషి చాలా స్వల్పం.

ఇవ్వాళ యువతకు సృజనాత్మకత అనేది స్వీయ సంపాదనాంశం. కృత్రిమ మేధో (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) రంగంలో కృషి చేసి డబ్బులు సంపాదించుకుంటున్నవారు అక్కడక్కడ కనబడతారు. వీళ్లని మరమనుషులుగా తీర్చిదిద్దడంలో టీచర్లతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఉన్నది. ఎందుకంటే పోటీ ప్రపంచంలో తమవాడు ఎక్కడ వెనకబడతాడో అనే ర్యాట్ రేస్‌లో వీళ్లే వాళ్లని ముందుంచుతారు. ఈ రేస్‌లో మానవసంబంధాలు వెనకతట్టు పడతాయి. నిత్యం దేశం, రాష్ట్రంలో జరిగే హింస ఇందుకు నిదర్శనం. ఈ హింసాయుత సమాజానికి మానవీయ బంధాలను జోడిరచే సాహిత్యం అవసరం ఉన్నది. అయితే సృజనాత్మక కథలు, నవలలు రాసేవారు (యువత), ముఖ్యంగా తెలుగులో రాసేవారు ఒక్క చెయ్యి వేళ్లమీద లెక్కపెట్టేంత మంది కూడా లేరు. ప్రతీదీ 'ఈక్వల్ మంత్లీ ఇన్‌స్టాల్‌మెంట్' (ఇఎంఐ) మయం కావడంతో దాని చుట్టూతా గానుగెద్దులాగా తిరగడమే ఉద్యోగస్థులకు/భద్రజీవులకు మిగిలింది. నిరుద్యోగులు సైతం ఎప్పుడెప్పుడు ఈ గానుగెద్దు జోన్‌లోకి పోదామా? అనే తహతహతోనే ఉన్నారు తప్ప ఉద్యోగం, సాహిత్యం రెండిరటి సమన్వయం ద్వారా బతుకగలమనే భరోసా మాత్రం వారికి పాఠకులు, సమాజం ఇవ్వలేక పోతున్నది. ఇవ్వాళ ఏదో ఒకటి రెండు పుస్తకాలు సోషల్ మీడియాలో హైప్ చేస్తే కొన్ని కాపీలు అమ్ముడుపోతాయేమో కావొచ్చు గానీ మెజారిటిగా పుస్తకాలకు గిరాకీ లేదు. తెలుగులో ఒక జ్ఞానమున్న 'యువ' పాఠకవర్గం ఏర్పడలేదు. అట్లా ఏర్పడితే కనీసం అవార్డు పొందిన, పేరున్న కొందరి రచనలు కొన్ని వందల కాపీలు అమ్ముడు పొయ్యేందుకు అవకాశముంటుంది. అందుకే సాహిత్యమే జీవనోపాధిగా బతకగలిగే పరిస్థితి మాత్రం లేదు. ఇట్లాంటి సందర్భంలో కొత్తగా రచయితలుగా బతకడం కష్టం. అందుకే యువ రచయితల సంఖ్య చాలా తక్కువగా ఉన్నది.

ఇవ్వాళ సమాజంలో భార్యను చంపి ముక్కలుగా కోసి కుక్కర్‌లో ఉండికించిన వార్తలు, గర్భవతిపై కూర్చొని కిరాతకంగా హత్య చేసిన భర్త, భర్తను రోకలి బండతో మోది చంపిన భార్య, పిల్లలని చంపి ఉరివేసుకున్న తల్లి, మద్యానికి బానిసైన కొడుకుని చంపిన తండ్రి ఇట్లా హత్యల గురించి వార్తలు వెలువడుతూ ఉంటాయి. ఇది నిత్యకృత్యం. అయితే ఇంత హింసాత్మకంగా మారుతున్న సమాజాన్ని మంచి సాహిత్యం కొంతైనా మార్చగలదు. ఈ మంచి సాహిత్యానికి ఇవ్వాళ వేదికలు తక్కువగా ఉన్నాయి. అందరికీ ఫోన్లు అందుబాటులో ఉన్నప్పటికీ మంచి సాహిత్యం ఆ స్థాయిలో అందులో అందుబాటులో ఫోన్ వాడకం దారులకు లేదు. కొన్ని కథలు పాడ్‌కాస్ట్‌లో అందుబాటులో ఉన్నాయి. కానీ పనిచేసుకుంటూ, జాగింగ్ చేస్తూ సాహిత్యాన్ని ఆస్వాదించే స్థాయిలో తెలుగు సాహిత్యం రావడం రావడం లేదు. టెలివిజన్‌లో వచ్చే ఏడుపుగొట్టు సీరియల్స్, హింసను ప్రేరేపించే సినిమాలు మంచి సాహిత్యాన్ని ఆదరించలేవు. అందుకే విజువల్ మీడియాలో కొత్త కథలు, కథనానికి అంతగా గుర్తింపు దక్కడం లేదు. దీనికి తోడు ఇవ్వాళ యువ పాఠకులకు మంచి సాహిత్యం పేరిట సీనియర్లు సజెస్ట్ చేస్తున్నదంతా బ్రాహ్మణీయ భావజాల సాహిత్యమే! ఎప్పుడో కాలం చెల్లిన సాహిత్యాన్ని ఇంకా అందలం ఎక్కిస్తూ కొత్త నీరుని వీళ్లు ఆహ్వానించలేక పోతున్నారు. కొత్తగా రాస్తున్న వారి రచనలపై నిజానికి తగినంత చర్చ జరగడం లేదు. వాటిపై శ్రద్ధ కనబరచడం లేదు. ఇవ్వాళటికీ సాహిత్య చరిత్ర పేరిట కందుకూరి వీరేశలిగం, కవిత్వంలో శ్రీశ్రీని, కథల్లో చలం, కుటుంబరావుని, నవలా రచయితల్లో నోరి నరసింహశాస్త్రులను మోడల్స్‌గా చూపిస్తున్నామంటే కొత్త తరం పాఠకులను తెలుగు సాహిత్యానికి దూరం చేస్తున్నవారమవుతాము. మారుతున్న సమాజం, ఆలోచనలకు అనుగుణంగా కొత్త తరానికి తర్ఫీదు ఇవ్వడంలో విద్యావ్యవస్థ, నేటి తరం సాహితీవేత్తలు, మీడియా అన్నీ విఫలమయ్యాయి. ఇదంతా ఎందుకంటే ఇవ్వాళటి పాఠకుడే రేపటి రచయిత.

అయితే ఈ గానుగెద్దు జీవితాన్ని కాదని సృజన చేస్తున్న రచయితలు అక్కడక్కడ కనిపిస్తూ ఉంటారు. వీళ్లు కవిత్వానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ కథలు, నవలలు రాస్తున్న వారు కూడా ఉన్నారు. వారిలో కథలు రాస్తున్నవారిలో కె.వి.మన్‌ప్రీతమ్, శ్రీ ఊహ, కవిత్వంలో తగుళ్ల గోపాల్, నిర్వాహణ కేపబిలిటీస్‌లో రమేశ్ కార్తిక్ నాయక్ తదితరులు ఫ్యూచర్ హోప్. దేశ యువత శాతంతో పోలిస్తే యువ రచయితలు లక్షకి ఒక్కరు కూడా లేరంటే అతిశయోక్తి కాదు. దాదాపు పదివేల మందికి ఒక డాక్టరు ఉన్నడు. కానీ డాక్టరు కన్నా ఎక్కువగా నీ ఫీలింగ్స్, మనోభావాలను అర్థం చేసుకొని నీ బాధను తన బాధగా వ్యక్తీకరించే రచయితల అవసరం ఇవ్వాళ ఎక్కువగా ఉన్నది. కనీసం పదివేల పాఠకులకు ఒక రచయిత అయినా ఉండాలి. దురదృష్ట వశాత్తు రచయితలే గాకుండా పాఠకుల కొరత కూడా ఉన్నది. పాఠకులు/పాడ్‌కాస్ట్ లిజనర్స్ పెరిగితే రచయితలు కూడా పెరుగుతారు. ఇందుకు మీడియా పరంగా మంచి సాహిత్యాన్ని ఎంపిక చేసి ప్రచారంలో పెట్టే వేదికల అవసరమున్నది. ప్రత్యేకంగా పాడ్‌కాస్ట్‌పై ఫోకస్ పెట్టాల్సిన అవసరమున్నది. ఏది పడితే అది ప్రచురించి అదే గొప్ప సాహిత్యమని దబాయించి, ప్రచారం చేయడం గాకుండా భిన్న జీవితాలను దగ్గరగా చూసి వాటిని అధ్యయనం చేసి అందులోని సారాన్ని అర్థవంతంగా అందించే రచనల ప్రచురణకు కృషి జరగాలి. అప్పుడే కొత్త రచయితలు, పాఠకులు పెరుగుతారు. ఇట్లా ఇద్దరూ పెరగడమంటే సమాజంలో హింసను తగ్గించడమే! మెరుగైన సమాజాన్ని నిర్మించడమే!



డా. సంగిశెట్టి శ్రీనివాస్

# వేదనల తీరం.. వెలుగుల భారం - దాతాపీర్

ఈ నవలలో భారతీయ పేద ముస్లింల జీవన సంఘర్షణని ప్రదర్శించారు హృశీకేశ్ సులభ్. పాట్నాలో హిందూముస్లింలు శతాబ్దల తరబడి ఇరుగుపొరుగులా ఉన్న రోజుల నాటి కథ ఇది. వీరు సమాజంలో ఒకరు లేకుండా మరొకరు మనలేనంతగా మిళితమైపోయిన కాలం అది!

కబ్రస్థాన్ కేంద్రంగా సామాన్య ముస్లింల జీవితాలని స్పృశిస్తూ సాగిన ఈ నవల కొందరి ఆశలను, ఆశయాలను, వారి జయాపజయాలను, దుఃఖాలను, సంతోషాలను ఆర్ద్రంగా వెల్లడిస్తుంది. నవలలో ప్రధాన పాత్రలు ముస్లిం మహిళలు. రసీదన్, అమీనా, చున్నీ ప్రత్యక్షంగా ఉంటూ కథను నడిపే పాత్రలు కాగా; చనిపోయిన మదీహా బానో కూడా కథలో భాగమై, ముఖ్య పాత్రగా నిలుస్తుంది.

కబ్రస్థాన్లో ఉంటూ, శవసంస్కారాలు చేసే కుటుంబానికి పెద్ద రసీదన్. అమీనా, చున్నీ అనే కూతుర్లు, ఫజ్లూ అనే దివ్యాంగుడైన కొడుకు. కటిక పేదరికంలో ఉంటుందా కుటుంబం. శవసంస్కారాలు పూర్తయ్యాక, వచ్చే ఈనాములతో జీవనం వెళ్ళబోస్తుంటారు. అంతర్ముఖి అయిన అమీనా తల్లికి అన్ని పనుల్లో సాయంగా ఉంటుంది. చున్నీ బబ్లూ అనే యువకుడిని ప్రేమిస్తుంది. అతన్ని పెళ్ళి చేసుకుంటూ ఈ కష్టాల కడలిని దాటవచ్చని భావిస్తుంది. ఫజ్లూ దోస్తు సాబిర్. చిన్నప్పుడే తల్లి మదీహా బానో చనిపోతే, ఆమె నేస్తం సాబిర్నే పెంచి పెద్ద చేస్తుంది. మాంసం, తోళ్ళ వ్యాపారం చేసే సత్తార్ మియా తన స్వార్థం కోసం ఫజ్లూ, సాబిర్ను వ్యసనాలకు బానిసలను చేస్తాడు.

సాబిర్ అమీనాలు ఒకరినొకరు ఇష్టపడతారు. పెళ్ళి చేసుకోవాలనుకుంటారు. రసీదన్‌కి అభ్యంతరం ఉండదు. చున్నీ బబ్లూతో కలకత్తాకి పారిపోయి, బబ్లూ మేనత్త సాయంతో అతన్ని పెళ్ళి చేసుకుంటుంది. అక్కడే ఓ చిన్న ఉద్యోగం చూసుకుంటుంది. ఇక్కడ ఫజ్లు ఆరోగ్యం క్షీణిస్తుంది. రసీదన్ క్రుంగిపోతుంది. తన తాతగారైన స్వర్గీయ దాతాపీర్ తోనూ, తనకి మేనల్లుడి వరుసయ్యే సమదూ ఫకీర్ తోనూ తన బాధలు చెప్పుకుని ఊరట పొందుతూంటుంది. తల్లి స్థానంలో కబ్రస్థాన్ పనులన్నీ అమీనా చూసుకోవడం మొదలుపెడుతుంది.

సాబిర్కి తన తల్లి కుటుంబపు వివరాలు తెలుస్తాయి. మేనమామల ఇంటికి వెళ్ళి అమ్మ ఫోటో ఒకటి అడిగి తెచ్చుకుంటాడు. షెహనాయి కళాకారులైన మేనమామలు తమ వారసుడి కోసం





చూస్తుంటారు. తమ బావగారు (సాబిర్ తండ్రి) గొప్ప షెహనాయి కళాకారుడు కాబట్టి సాబిర్కిక శిక్షణనిస్తే, తమ వారసత్వపు కళని కొనసాగించవచ్చని అనుకుంటారు. పీర్ ముహానీ నుంచి సుల్తాన్ గంజ్‌లోని తమ భవనానికి సాబిర్ మకాం మార్పించి తమ వద్దే ఉంచుకుని శిక్షణ ఇప్పిస్తారు. తనకి పెళ్ళి చేయాలని మేనమామలు చూస్తున్నప్పుడు తన ప్రేమ గురించి సాబిర్ చెప్తే, సంగీతాన్ని ప్రేమించమని మేనమామ సలహా ఇస్తాడు. మొదట అయిష్టంగానే సాధన చేసినా, తరువాత సంగీతంలో లీనమవుతాడు సాబిర్. అతడి జీవనశైలిలో మార్పులు వస్తాయి.

అమీనాకి అత్యవసరమైన ఓ సందర్భంలో సాబిర్ రాలేకపోతాడు. దాంతో ఆమె మనసు విరిగిపోతుంది. అతనికి దూరంగా ఉండడం ప్రారంభిస్తుంది. సాబిర్ సంగీతంలో రాణించి, ఢిల్లీలో జరిగిన షెహనాయీ మేలాలో పాల్గొంటాడు. అక్కడ అతను ఓ పాటని షెహనాయీ మీద పలికిస్తుండగా, పీర్ ముహానీలో ఫజ్లూ తుదిశ్వాస విడుస్తాడు.

ఈ నవలలో పాట్నాలోని రెండు ప్రాంతాలను పాఠకుల కళ్ళకు కడతారు రచయిత. ఇరుకు సందుల పీర్ ముహానీ ప్రాంతంలోని పేదవారి జీవితం, సంపన్నుల నివాస ప్రాంతమైన సుల్తాన్ గంజ్! రెండు విభిన్న శైలుల జీవనం గడిపే పేద, సంపన్న వర్గాల ముస్లింలు కనబడతారీ ప్రాంతాలలో. నవలలో కథలో భాగంగా మజార్లు, పీర్లు తటస్థపడతారు. వేదన నిండిన జీవితాలకు తమదైన రీతిలో సాంత్వన కలిగిస్తారు. ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లుతారు. మనుషులలోని భావోద్వేగాలను గొప్పగా వ్యక్తం చేస్తుందీ నవల. ఉన్న స్థితి నుంచి పైకి ఎదగాలనుకున్న వారికి అందరికీ అవకాశాలు రావు, అవకాశం దొరికిన వారిలో కొందరే ఎదగగలుగుతారు, ఎందరో పరిస్థితులకు లొంగిపోయి, జీవచ్ఛవాల్లా బ్రతికేస్తారు. జీవితంలో సాబిర్ ఎదిగినా, కోల్పోయినవి చాలానే ఉన్నాయి. చిన్నప్పుడే తల్లిదండ్రులని కోల్పోతాడు. జీవితంలో నిలదొక్కుకునే ప్రయత్నంలో, ప్రేయసికి దూరమవుతాడు. సంగీతంలో గుర్తింపు పొందినా, జీవితంలో పెద్ద వెలితి ఉండిపోతుంది. వెలుగుల తీరమైతే చేరుతాడు, కానీ వేదనల భారం మోస్తూ!

~

డా. శ్రీమతి పుట్టపర్తి నాగపద్మిని అత్యంత నేర్పుగా అనువదించిన ఈ నవల పాఠకులను ఆకట్టుకుంటుందనడంలో సందేహం లేదు. ఇటీవలి కాలంలో హిందీ నుంచి తెలుగులో అనువాదమై, పాఠకులని అలరించిన నవలల్లో 'దాతాపీర్' ప్రముఖమైనది. ప్రముఖ నవలా, నాటక రచయిత శ్రీ హృశీకేశ్ సులభ్ రచించిన ఈ నవలని రాజ్కమల్ ప్రకాశన్ వారు 2022లో ప్రచురించారు. డా. శ్రీమతి పుట్టపర్తి నాగపద్మిని గారు 'దాతా పీర్'అనే పేరుతోనే తెలుగులోకి అనువదించారు. ఈ పుస్తకం డిసెంబర్ 2024లో విడుదలైంది.



**సమీక్షకులు: కొల్లూరి సోమ శంకర్**

**దాతాపీర్ (అనువాద నవల)**

**హిందీ మూలం: హృశీకేశ్ సులభ్**

**తెలుగు: డా. శ్రీమతి పుట్టపర్తి నాగపద్మిని**

**పేజీలు: 247.. వెల: ₹ 200/-**

**ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు**

**డా. శ్రీమతి పుట్టపర్తి నాగపద్మిని 7893976644**

**శ్రీమతి జ్యోతి వలబోజు 8096310140**

**నవల అనువాదకురాలి పరిచయం**

డా. పుట్టపర్తి నాగపద్మిని, గద్య, పద్య, అనువాద రంగాలలో దాదాపు 50 ప్రచురణలతో ఎన్నో సంవత్సరాలుగా సుపరిచితమైన పేర మెది పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం అనువాద పురస్కారం, గోయెంకా అనువాద పురస్కారం, బీహార్ సాహిత్య పరిషత్. తమిళనాడు హిందీ అకాడమీ సమ్మాన్, జీవన సాఫల్య పురస్కారం. రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాక, లక్నో, చిత్రకూట్, అమెరికా వాటా సభల్లోనూ సమ్మానాలను అందుకున్నారు. గత 15 ఏళ్లుగా శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్ లో శ్రీవారి బ్రహ్మోత్సవ ప్రత్యక్ష ప్రసార హిందీ వ్యాఖ్యాతగా నాక్ సేవలు అందిస్తున్నారు. తిరుప్పావై, తిరువెండావై, ఆళ్వారుల వైభవం, మన సీతమ్మ కథ వంటి అనేక విషయాలపై పలు యూ ట్యూబ్ చానళ్ళలో ధారావాహిక తెలుగు ప్రసంగాలు చేశారు. చేస్తున్నారు. తమ తండ్రిగారు సరస్వతీపుత్ర పుట్టపర్తి వారి వ్యాస సంకలనాలు, కావ్యాలు, సంపూర్ణ సాహిత్య సంకలనాలు వెలువరించటమే కాక, ఇటీవల, తండ్రిగారి శివ తాండవ గేయ కావ్యాన్ని హిందీలోకి అనువదించి, హిందీ సాహిత్య ప్రపంచం మన్ననలు పొందారు. అనువాడ రంగం లో తాను చేస్తున్న కృషికి కొనసాగింపుగా యీ వైవిధ్య కథావస్తువు ఉన్న నవల తెలుగు పాఠకులకు నేను అందజేస్తున్న కానుక యీ రచన. 'అంటున్నారు శ్రీమతి నాగపద్మిని.



డా. పుట్టపర్తి నాగపద్మిని



## ప్రకృతికి వ్యతిరేక పదం

పరిణామ క్రమంలో
కోతి పూర్తిగా మనిషి రూపం
సంతరించుకోగానే
మనిషి కనురెప్పల మీది నుండి
కొన్ని పక్షులు ఎగురుకుంటూ వెళ్లి
అడవిలో నుంచి ఒక మొక్కను తెచ్చి
అతడి చూపుల్లో నాటాయి.
అప్పటినుండి మనిషి ప్రకృతితో కలిసి
వేల ఏండ్లు జీవించాడు
కాలక్రమేణా
మనిషి చెట్టు వైపు చూసే చూపులో
ఏదో తేడా జరిగి
అతడి చూపు పడ్డ చోట
మొక్క బదులు ఎడారి మొలవడం
మొదలైంది
కొన్ని పక్షులు ఎగిరిపోయాయి
మరికొన్ని రాలిపోయాయి
చెట్ల చివరి చూపు కూడా నోచుకోకుండా
ఇంకొన్ని కాలిపోయాయి
విత్తనంలోంచి చిన్న మొలక పురుడు
పోసుకున్నా చాలు
పక్కనున్న మొక్క ఆ మొలకకి
మనిషిని చూపించి "జాగ్రత్త"
అని చెవిలో గుసగుసగా
చెబుతోంది ఇప్పుడు

**- భగవంతం**



## హైకు

**1.**
**సాగి పోతోంది..**
**కాలుష్యాన్ని పంచుతూ**
**జనప్రవాహం**

**2.**
**ఏరు పారుతూ**
**మోసు కెళ్తుంది**
**పల్లవి, చరణం**

**3.**
**శిశిర సంధ్య -**
**రాలుతున్న ఆకులతో**
**దిగులు చెట్టు**

**4.**
**బయట వాన పావురాల**
**జంట వసారాలో**

**5.**
**నీటి కుంచెతో**
**వాన వేసిన చిత్రం ఇంద్ర ధనుస్సు**



**డా . రూప్ కుమార్ డబ్బీకార్,**
**91778 57389**

## నీడైనా అంతేగా...

మనసు కాస్తా
కుదుట పడితే బాగుండు
అవ్యక్త దిగులొకటి వెంటాడుతున్నది
యుద్ధమూ లేదు.. గాయాలూ లేవు
భ్రమ పూర్వక పరాజయమొకటి వెంటాడుతన్నది!
సమూహం మధ్య నేను
ఒంటరిగా దిగులు దిగులుగా నుంచున్న
ఓదార్చే చేతుల కోసం ఎదురు చూస్తూ
నేనూ నిప్పుల మీద నడిచిన వాడినే
ఎన్నో బాధల్ని దిగమింగిన వాడినే
ఇది కష్టమో కాల పరీక్షో తెలియదు
మనసు విప్పలేక పోతున్న
శక్తి ఉడగ లేదు యుక్తి తరగ లేదు
ఒక తరాన్ని వీడి
మరో తరంలోకి పయనిస్తున్న
నమ్మదగిన మిత్రులు ఒకరొకరు
కనుమరుగై పోతుంటే కాలం కలవరపెడుతున్నది!
ఒక్కోసారి వచ్చిన పని అయిపోయినట్లేనా అని
మనసు పదే పదే ప్రశ్నిస్తున్నట్లుంటది!
'విజయవంతం'గా అని చెప్పాలని ఉంది
చెబితే ప్రయాణం ఆగిపోతుందా?
నీడైనా అంతేగా
మనం తోడున్నంత వరకే
మన వెంట!!



**- కోట్ల**
**వెంకటేశ్వర రెడ్డి,**
**9440233261**

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# మహా పత్రిక

ANN తెలుగు | సోమవారం, హైదరాబాద్ | 27-01-2025 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM



## సీఎం ఆశయాలకు అనుగుణంగా జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సమన్వయంతో కృషి

**76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

**పోలీస్ జాగిలాలకు ప్రసంశలు**



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్



ప్రసంశ పత్రం అందుకుంటున్న సిహెచ్. పురుషోత్తం, డిపిఆర్ఓ



ఆశ్చర్యపరచిన పోలీసు జాగులాలు జాకీ, జూలీ, మ్యాగీలు

**రాయచోటి మహా:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండులో 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత వేడుకగా కన్నుల పండువగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా కలెక్టర్ మెజిస్ట్రేట్ శ్రీధర్ చామకూరి జాతీయ జెండా పతాకావిష్కరణ గావించి రాష్ట్రీయ సెల్యూట్ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో కలిసి మైదానంలో పెరేడ్ ను పరిశీలించగా వివిధ ప్లాటూన్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహించాయి. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టి అమలు చేస్తున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ శ్రీధర్ చామకూరి సందేశమిస్తూ 2047 వసంవత్సరం నాటికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర గా తీర్చిదిద్దాలన్న సిఎం చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సమన్వయంతో కృషి చేస్తున్నారన్నారు. దేశంలోనే ఆదర్శవంతంగా అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. 2047 వసంవత్సరం నాటికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర గా తీర్చిదిద్దేందుకు సిఎం చంద్రబాబు నాయుడు పది సూత్రాల ప్రణాళికను ఇచ్చారన్నారు. పేదరికం లేకుండా చేయడం, ఉపాధి అవకాశాలను పెంచడం, నైపుణ్యాభివృద్ధి,మానవ వనరుల అభివృద్ధి, లాజిస్టిక్స్ ఏర్పాటు,ఇంధన వనరుల కాస్ఆప్టిమైజేషన్, ఉత్తమమైన వస్తువుల తయారీ, స్వచ్ఛ ఆంధ్ర, జీవితంలోని అన్ని రంగాలలో డీప్ టెక్నాలజీని వాడుకోవడం వంటి 10 సూత్రాలను అమలుచేసి 2047 నాటికి మన రాష్ట్రాన్ని $2+ ట్రిలియన్ డాలర్ వృద్ధి కలిగిన రాష్ట్రం గా చేసేందుకు సిఎం స్ఫూర్తితో అన్నమయ్య జిల్లా ప్రగతి పథంలో ముందుకెల్తుందన్నారు. అన్నమయ్య జిల్లాలో రూ.6,210 కోట్లతో 276 కిమీల మేర చేపట్టిన 8 జాతీయ రహదారుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయడం పై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ప్రగతి శకటాల ప్రదర్శన అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయా శాఖల పరిధిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన అధికారులకు, సిబ్బందికి ప్రసంశ పత్రాలు అందజేశారు.

### రాయచోటి పట్టణ అభివృద్ధి :

జిల్లా కేంద్రంగా ఏర్పడిన రాయచోటి పట్టణాన్ని ప్రభుత్వ సహకారంతో అన్ని విధాల అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని, రాయచోటిలో చేపట్టిన క్రికెట్ స్టేడియం, శిల్పారామం, నగరవనం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలలో పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

### పోలీసు జాగిలాలకు ప్రసంశలు:

పోలీసు పెరేడ్ గ్రౌండ్లో జరుగుతున్న 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో పోలీసు జాగిలాలు "జాకీ, జూలీ, మ్యాగీలు" నేరస్తులు వదిలి వెళ్లిన వస్తువులను పట్టుకోవడం, నేరస్తులను గుర్తించడం, ఎర్రచందనం వాహనాల గుర్తింపు తదితరాల పనులు చూపర్లను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. జాగిలాల ప్రతిభను చూసిన చూపరులు చప్పట్లతో అభినందించారు.

## కడపలో ఫ్లెక్సీ వార్

- ఆర్ట్స్ కాలేజీ వద్ద వెలిసిన ఫ్లెక్సీలు
- 21తో గేమ్ ఛేంజర్ అవ్వలేము.. 50 తీసుకోవాలి అంటూ బ్యానర్లు
- తట్టుకోలేక పోతున్నామన్నా అంటూ లెక్సెస్ట్
- కనీసం ప్రతిపక్షంలో ఉన్నా మంచిపేరు ఉంటదని సజెషన్
- మాకు స్వలాభం అస్సలు ఉండదంటూ మరో ఫ్లెక్సీ
- రాష్ట్రంలో రచ్చ లేపుతున్న ఫ్లెక్సీల వ్యవహారం







**కడప, మహా:** కడప జిల్లాలో వైసీపీ జనసేన మధ్య ఫ్లెక్సీ వార్ వెలుగు చూసింది. గేమ్ ఛేంజర్ కావాలంటే 21 కాదని 50 50 సీట్లు కోరి ఉండాల్సిందని పేర్కొంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ఇదంతా ప్రస్తుతం రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో జనసేనను ఉద్దేశిస్తూ వైసీపీ క్యాడర్ ఏర్పాటు చేసింది అన్న ప్రచారం జోరుగా సాగుతుంది. ఇటీవలే లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న వాదన తెరపైకి వచ్చిన నేపథ్యంలో జనసేన కేడర్ కూడా అదే స్థాయిలో స్పందిస్తూ లోకేష్ను డిప్యూటీ సీఎం చేస్తే ... పవన్ కళ్యాణ్ ను సీఎం చేయాలంటూ పెద్ద ఎత్తున డిమాండ్లు అయితే వినిపించాయి. ఈ పరిస్థితుల్లో లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న డిమాండ్లు ఎవరూ బహిరంగంగా మాట్లాడవద్దని, కూటమిగా సమిష్టిగా నిర్ణయం తీసుకొని చర్చించిన నిర్ణయాలను మాత్రమే బహిరంగంగా చెప్పాలంటూ టీడీపీ అధిష్టానం గట్టి హెచ్చరికలను జారీ చేసింది. కానీ ఇప్పుడు మాత్రం ఇలా టీడీపీ వ్యాఖ్యలను గట్టిగా ఎదుర్కోవాలంటే జనసేన పోటీ చేసిన 21 సీట్లు కాదని ఎన్నికల ముందు పొత్తు పెట్టుకునే సందర్భంలో 50 స్థానాలు కోరి ఉండాల్సిందని అర్థం వచ్చేలా ఇప్పుడు ఫ్లెక్సీలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఎన్నికల ముందు టీడీపీతో పొత్తు పెట్టుకున్న సమయంలో జనసేన 50 సీట్లు కోరాలని సొంత కేడర్ నుంచి ఒత్తిడి వచ్చినా... సీట్లు ముఖ్యం కాదు గెలుపు ముఖ్యమంటూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ 21 సీట్లతో సరి పెట్టుకున్నారు. కానీ ఎన్నికల్లో పోటీ చేసిన 21 సీట్లలోను జనసేన గెలవడం పెద్ద సంచలనం అయ్యింది. అధికారంలోకి వచ్చాక పరిస్థితి సానుకూలంగానే సాగిన గత కొద్ది రోజులుగా మాత్రం జనసేన టీడీపీ కేడర్ మధ్య రకరకాల వాదనలు వాదోపవాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటీవల నారా లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్లు తెరపైకి వచ్చాక మాత్రం పార్టీల మధ్య పరిస్థితి కొంత తేడాగానే కనిపిస్తుంది అన్న వాస్తవం అందరికీ తెలిసిందే. ఓవైపు డిప్యూటీ సీఎం పదవి పేరుతో అగ్గిరాజేస్తే కొత్తగా చంద్రబాబు నారా లోకేష్ దావోస్ పర్యటన మరో కొత్త వివాదానికి తెరపడినట్లైయింది. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ ను వదిలేసి మంత్రిగా ఉన్న నారా లోకేష్ ను సీఎం చంద్రబాబు దావోస్ కు వెంటబెట్టుకుని వెళ్లడం ఏంటని ప్రశ్నలు వ్యక్తం అయ్యాయి. ఇప్పుడు కడపలో వెలిసిన ఫ్లెక్సీలోనూ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ గేమ్ ఛేంజర్ కావాలంటే 21 కాదు 50 అడిగి ఉండాల్సిందని అందులో ప్రస్తావించారు. మిమ్మల్ని ఇక్కడ వదిలేసి వాళ్లు దావోస్ వెళ్లారని, అక్కడ వాళ్లను పట్టించుకునే నాథుడు లేడన్నారు. కనీసం మీరు వెళ్లినా నాలుగు కంపెనీలు వచ్చేవంటూ అందులో ప్రస్తావించారు. కనీసం ప్రతిపక్షంలో ఉన్నా మనకు మంచి పేరు ఉంటుందని, లేకపోతే ఆ దరిద్రం అంతా మన నెత్తికి చుట్టుకుందని, దీన్ని తట్టుకోలేక పోతున్నామన్నా అని రాసి ఉంది. డిప్యూటీ సీఎం పవన్ ఫ్లెక్సీకి ధీటుగా వైసీపీ నుంచి జగన్ పేరిట ఆ పక్కనే మరొకటి వెలిసింది. జగన్ బ్రాండ్ అంటే ఏందో తెలుసునా మీకు అంటూ కాసింత రెచ్చగొట్టే విధంగా ప్రయత్నం చేస్తున్నాయి ఫ్యాన్ పార్టీ శ్రేణులు. వైసీపీ కార్యకర్త అంటేనే ఒక బ్రాండ్ అని, కూటమిని చీల్చాలనేది ఉండదు.. మాకు స్వలాభం అస్సలు ఉండదని ప్రస్తావించారు. లీడర్లు వస్తూంటారు.. పోతుంటారు., పార్టీని నడిపించేది మా లాంటి కరుడు కట్టిన కార్యకర్తలే మా జగనన్న ఆస్తి.. సొంతం కూడా పేర్కొన్నారు. అలాగే కూటమికి వచ్చిన సీట్ల గురించి ప్రస్తావించారు. ఈ లెక్కన కడపలో ఏదో జరుగుతోందన్న చర్చ రాష్ట్రవ్యాప్తంగా నెలకొంది. వీటిని చూసిన కొందరు నాయకులు మాత్రం ఈ ఫ్లెక్సీ గోలేంటి? అంటున్నారు. మరికొందరైతే కావాలనే ఈ విధంగా చేయిస్తున్నారని చెప్పేవాళ్లే లేకపోలేదు. ఈ ఫ్లెక్సీ వార్ రాబోయే రోజుల్లో ఎటువైపు దారి తీస్తొందోననేది తెలియాలి అంటే వేచి చూడాల్సిందే.

## వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో గణతంత్ర దినోత్సవ వేడుకలు



**వరంగల్, మహా;** 76వ గణతంత్ర దినోత్సవాన్ని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ కమిషనరేట్ పరిపాలన విభాగం భవనం ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ అధికారులు, సాయుధ పోలీసులు ఇతర పోలీస్ సిబ్బంది జాతీయ జెండాకు గౌరవ వందనం చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలపడంతో పాటు చిన్నారులకు స్వీట్లను అందజేశారు.

## మోడల్ స్కూల్ విద్యార్థినులకు అరుదైన అవకాశం



**కంచిలి:** శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలంలోని మఠం సరియాపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ ప్రాజెక్టు రూపకల్పన చేసే అరుదైన అవకాశాన్ని పొందారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాదికారి టి.తిరుమల చైతన్య నుంచి పాఠశాలకు శనివారం ఉత్తర్వులు అందాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో భాగంగా అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ ప్రాజెక్టు రూపకల్పన చేసి ప్రదర్శించేందుకు ఇక్కడి విద్యార్థినులకు అవకాశం లభించింది. పాఠశాల విద్యా శాఖ తరపున జిల్లాలో మఠం సరియాపల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు ఐదుగురు, పొన్నాడ కేజీబీవీ విద్యార్థినులు ఐదుగురు ఎంపికైనట్టు ఉత్తర్వులు వెలువడ్డాయని ప్రిన్సిపాల్ శివప్రసాద్ వెల్లడించారు. వీరు ఈ నెల 26నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు బెంగళూరులో జరిగే ఇంటర్‌స్టేట్ హాకథాన్ ప్రోగ్రామ్‌లో పాల్గొనబోతున్నట్టు తెలిపారు. పాఠశాలకు చెందిన ఆరాధ్య పాణిగ్రాహి (9వ తరగతి), శ్రద్ధాంజలి మహంతి (9వ తరగతి), యాస్మిన్ చౌదరి (7వ తరగతి), రితిక బడిత్య (9వ తరగతి), మహంతి శ్రద్ధాంజలి (9వ తరగతి), గైడ్ టీచర్ బడియా సత్యనారాయణ ఈ ప్రాజెక్టు ప్రదర్శనకు ఎంపికయ్యారు. ఐదుగురు విద్యార్థినులు, గైడ్ టీచర్ బెంగళూరు వెళ్లి రావడానికి ఉచిత విమాన ప్రయాణం, ఫైవ్ స్టార్ వసతి కల్పించనున్నారు.

## ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్ కు ప్రతిభా అవార్డు

**అవార్డు ప్రదానం చేసిన కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నిశాంత్ కుమార్**



**అనకాపల్లిజిల్లా, పాయకరావుపేట, మహా:** *గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అమరావతిలో కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్ పాయకరావుపేటకు ప్రతిభా అవార్డును అందజేశారు. ఈ అవార్డు సాధించిన జి.శ్రీనివాస్ కు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఫారెస్ట్ ల్యాండ్ కబ్జాకు యత్నం.. అడ్డుకున్న ఫారెస్ట్, పోలీస్ అధికారులు

**రిపబ్లిక్ డే సందర్భంగా జెండా ఎగరేసి స్వాధీనం చేసుకోవాలని ఓ న్యాయవాది పిలుపుతో పెద్ద ఎత్తున వచ్చిన జనం**

**ఫారెస్ట్ ల్యాండ్ ను ప్రైవేట్ ల్యాండ్ గా చూపుతూ 50వేల మందికి అమ్మేసిన యూసఫ్ ఖాన్ అనే వ్యక్తి**

**ఎల్బీనగర్, జనవరి 26, మహా:** రిపబ్లిక్ డే రోజు జెండా ఎగురవేసి ప్లాట్లు స్వాధీనం చేసుకోవాలని ఓ వ్యక్తి ఇచ్చిన పిలుపుతో ఫారెస్ట్ ల్యాండ్ పైకి వచ్చిన కొంతమందిని వనస్థలిపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఎల్బీనగర్ లోని మన్సూరాబాద్ సర్వే నంబర్ 7లో 580ఎకరాల ఫారెస్ట్ భూమి ఉంది.ఈ ఫారెస్ట్ ల్యాండ్ ను ప్రైవేట్ ల్యాండ్ గా చూపుతూ యూసఫ్ ఖాన్,సుల్తానా అనే దంపతులు సుమారు 50వేల మందికి డాక్యుమెంట్స్ అమ్మేశారు.ఈ ల్యాండ్ పై డాక్యుమెంట్ దారులకు అనుకూలంగా తీర్పు వచ్చిందని స్వాధీనం చేసుకునేందుకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఈ కోర్టు కేసు వాదిస్తున్న జిలాని అనే న్యాయవాది పిలుపుతో ఆదివారం హరినవనస్థలి నేషనల్ పార్క్ ఫారెస్ట్ ల్యాండ్ వద్దకు జనం వస్తున్నారు.దీంతో ఫారెస్ట్ అధికారుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని అక్కడికి వచ్చిన వారిని అదుపులోకి తీసుకున్నారు.అయితే ఈ భూమి తమ తల్లిదని యూసఫ్ ఖాన్ నమ్మిస్తూ సుమారు 50వేల మందికి అమ్మేశాడు.దీనిపై హైకోర్టులో రిట్ ఫిటీషన్స్ వేస్తూ వస్తున్నారు.ఇప్పటి వరకు 280రిట్ ఫిటిషన్స్ వేయగా ఆ అన్ని ఫిటిషన్స్ ను కోర్టు కొట్టేసింది ఆ డాక్యుమెంట్స్ కొన్నవాళ్ళంతా 26జనవరి రోజు జెండా ఎగరవేసి స్వాధీనం చేసుకోవాలని పిలుపుతో అక్కడికి వచ్చిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అయితే ఫారెస్ట్ ఆఫీసర్లు మాట్లాడుతూ మన్సూరాబాద్ సర్వే నంబర్ 7లో ఉన్న 580ఎకరాలు పూర్తిగా రిజర్వ్డ్ ఫారెస్ట్ భూమి అని అవరైన ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి ఆధ్వర్యంలో ఇన్స్ పెక్టర్లు శ్రీనివాస్,అంజిరెడ్డి,నాగరాజు,వినోద్ కుమార్ ఫారెస్ట్ అధికారులు సాయిప్రకాశ్, విద్యాసాగర్ తదితరులు అక్కడ ఉండి నష్టపోయిన వారికి వివరించారు.







## ఘనంగా గణతంత్ర వేడుకలు

**ప్రభుత్వ ఆఫీసులలో జెండాను ఆవిష్కరించిన అధికారులు**

**అబ్దుల్లాపూర్ మెట్, జనవరి26,మహా:** మండల పరిధిలో 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా పురస్కరించుకొని.. అబ్దుల్లాపూర్ మెట్ తహసిల్దార్ కార్యాలయంలో సుదర్శన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా పెద్ద అంబర్ పేట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎస్ రవీందర్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులు మాట్లాడుతూ... యువత రాజ్యాంగ ఫలాలను అనుభవించటం తోపాటు బాధ్యతలను కూడా నెరవేర్చాలన్నారు. అదేవిధంగా దేశ రక్షణ లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీ వాణి, పెద్ద అంబర్ పేట మున్సిపల్ కమిషనర్ ఎస్ రవీందర్ రెడ్డి, చైర్ పర్సన్ పండుగల జయశ్రీ, వై చైర్ పర్సన్ చామ సంపూర్ణ, కౌన్సిలర్లు, అబ్దుల్లాపూర్ మెట్ సీఐ అంజిరెడ్డి, ఎస్సైలు కర్ణాకర్ రెడ్డి, మాధవరావు, భధ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు. గడ్డి అన్నారం ఫ్రూట్ మార్కెట్లో... 76 వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా గడ్డి అన్నారం మార్కెట్ కార్యాలయం బాటసింగారం వద్ద మార్కెట్ కమిటీ పాలకవర్గంతో కలసి చైర్మన్ చిలక మధుసూదన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరంలో ఉద్రిక్తత

**టీడీపీ-బీజేపీ నేతల మధ్య ఘర్షణ**



**శ్రీసత్యసాయి జిల్లా:** ధర్మవరంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. టీడీపీ బీజేపీ నేతల మధ్య ఘర్షణ జరిగింది. మంత్రి సత్యకుమార్ సమక్షంలో బీజేపీలో చేరేందుకు మైనార్టీ నేత జమీన్ సిద్ధమవ్వగా, జమీన్ చేరికను టీడీపీ ఇంఛార్జ్ పరిటాల శ్రీరామ్ వ్యతిరేకిస్తున్నారు. దీంతో మైనార్టీ నేత జమీన్ ఫ్లెక్సీలను పరిటాల శ్రీరామ్ వర్గీయులు చించివేశారు. ఈ క్రమంలో టీడీపీ బీజేపీ నేతల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటనలో రెండు స్కార్పియో వాహనాలు, మూడు బైకులు ధ్వంసమయ్యాయి. ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టారు. మరో వైపు, సామాన్యులపై కూడా టీడీపీ నేతల అనుచరులు రెచ్చిపోతున్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ప్రధాన అనుచరుడు దాదు.. శివమాలధారణలో ఉన్న బలిజ శ్రీనివాసులు అనే ఆటోడ్రైవర్‌పై అకారణంగా దాడి చేసిన సంగతి తెలిసిందే. కాళ్లతో తన్నుతూ అవమానించాడు. ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో శనివారం చోటు చేసుకుంది.

## స్వర్ణాంధ్ర 2047 లక్ష్యసాధన దిశగా ముందుకు

**■ పేదరిక రహిత సమాజమే ధ్యేయం..76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కడప జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్**





**కడప, మహా:** స్వర్ణాంధ్ర 2047 విజన్ కు సంబంధించి జిల్లాలో అనేక కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందని కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా కడప పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన వేడుకల్లో ఆయన జండా ఆవిష్కరణ చేసి గౌరవం స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక రహిత సమాజమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వము "జీరో పేదరికం" సాధాన కోసం పలు సమగ్ర వ్యూహాత్మక కార్యక్రమాలతో స్వర్ణాంధ్ర విజన్ లో పెద్దపీట వేయడం జరిగిందన్నారు. జిల్లాలో అధిక వృద్ధి పెరుగుదలకు ముఖ్యమైన "గ్రోత్ ఇంజన్" లు ఉద్యానవన రంగము, ఇంధన రంగము, పర్యాటకము, తయారి రంగము వున్నాయని, రాబోవు 5 సంవత్సరములకు జిల్లా వృద్ధి రేటును ప్రతి సంవత్సరము 15% వృద్ధి రేటు లక్ష్యంగా ముందుకెళుతున్నామన్నారు. 2024 ఖరీఫ్ సీజన్లో పెన్నా బేసిన్లో తక్కువ వర్షపాతం ఉన్నప్పటికీ క్రిష్ణానది మిగులు వరద జలాల ద్వారా జిల్లాలోని చిన్న, మధ్యతరహా, భారీ సాగునీటి ప్రాజెక్టుల పరిధిలోని 82,193 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించామని, ప్రాజెక్టు కాల్వల నిర్వహణ, నీటి నియంత్రణ పనులు, ఎత్తిపోతల పథకాలు నిర్మించడం, వాగులువంకల అనుసంధానం, ఆయకట్టు, నూతన చెక్ డ్యాంల నిర్మాణం వంటి పనుల ద్వారా జిల్లాలో మరింత ఆయకట్టు స్థిరీకరణ కోసం జలవనరుల శాఖ కృషి చేస్తుందన్నారు. జిల్లా పారిశ్రామిక ప్రగతిలో సిమెంట్ కర్మాగారాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయని, జూన్, 2024నుండి ఇప్పటివరకు 74 పరిశ్రమలకు రూ.10.99 కోట్ల పారిశ్రామిక రాయితీ నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే పిఎం విశ్వకర్మ పథకం క్రింద 21,184 మంది చేతివృత్తి పనివాళ్ళకు నైపుణ్య శిక్షణ ఇప్పించి 7,312 మందికి బ్యాంకర్ల ద్వారా రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వైఎస్ఆర్ జిల్లాలో పరిశ్రమల స్థాపన కొరకు 39 పారిశ్రామిక వాడలను స్థాపించడం జరిగిందని, అందుకోసం 11,358 ఎకరాల భూమిని సేకరించడమైందన్నారు. అందులో భాగంగా వివిధ పారిశ్రామిక వాడల్లో 3293 ఎకరాల భూమిని వివిధ రకాల పరిశ్రమలకు కేటాయించగా, పెద్ద పెద్ద పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం ఏర్పాటుకు, మెగా పారిశ్రామికవాడల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలను వేగవంతం చేస్తోందన్నారు. ఇందులో భాగంగా కొప్పర్తి (నార్త్) లో 3155 ఎకరాలలో 738 కోట్ల రూపాయలతో మెగా ఇండస్ట్రీయల్ హబ్ను అలాగే కొప్పర్తి (సౌత్) లో 2,596 ఎకరాలలో వైజాగ్‌చెన్నై ఇండస్ట్రీయల్ కారిడారును అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించడమైనదన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన శకటాలు కూడా ఆయా శాఖల ప్రగతిని కళ్ళ కట్టినట్టు చూపాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఇతర జిల్లా అధికారులు స్వాతంత్ర సమరయోధులు పాల్గొన్నారు

# కాసుకో కేటీఆర్..!

## నువ్వు నీ పార్టీ కొట్టుకపోవడం ఖాయం..

మీరెన్ని కుట్రలు చేసినా సంక్షేమ పథకాలు ఆగవ్.. సంక్షేమ పథకాలకు రూ.45 వేల కోట్ల భారం

సంపదను సృష్టించి ప్రతి పైసా పేదలకు పంచుతాం.. ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు ఇస్తాం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు



**ఖమ్మం, జనవరి 26:మహా:** ఇందిరమ్మ ఇల్లు.. రేషన్ కార్డులు ఇతర సంక్షేమ పథకాల మంజూరుకు ఈరోజు అంతం కాదు ఆరంభం మాత్రమే . నువ్వు నీ పార్టీ.. సంక్షేమ పథకాల ప్రవాహాల్లో కొట్టుకుపోవడం ఖాయం... నువ్వు నీ పరివారం భ్రమల్లోనే బతకండి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో సంపదను సృష్టించి నిరుపేదలకు పంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం జిల్లాలోని కొణిజెర్ల మండలం చిన్న గోపతి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన నాలుగు పథకాల ప్రారంభోత్సవ గ్రామసభలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు జరగకుండా చేయాలని టీఆర్ఎస్ పార్టీ కుట్రలు పన్నుతోంది.. నిధులు అందుబాటులో ఉన్న గత పది ఏళ్లపాటు మాలాగా టిఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. గత పాలకులు పది సంవత్సరాలు ప్రజల గురించి ఆలోచన చేస్తే మేము ఇంత పెద్ద సంఖ్యలో రేషన్ కార్డులు ఇవ్వాల్సి వచ్చేది కాదు అన్నారు. భారత రాజ్యాంగం ఈ దేశ జీవన విధానం.. ప్రపంచంలో భారత్ దేశం బలంగా నిలబడడానికి రాజ్యాంగమే పునాదులు వేసింది అన్నారు. హక్కులు, విధులు, ఎలాంటి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి, భావ స్వేచ్ఛకు సంపూర్ణ సహకారం రాజ్యాంగం ద్వారా మనకు లభించాయని తెలిపారు. రాజ్యాంగానికి భిన్నంగా నడుచుకోవాలని కొందరు చూస్తున్నారు సొంత భావజాలాన్ని ప్రజలపై రుద్దాలని కొందరు ప్రయత్నిస్తున్నారు అన్నారు. భారత రాజ్యాంగాన్ని మారుస్తాం అంటూ కేసిఆర్ మాట్లాడితే తగుదునమ్మా అంటూ ఆయన కొడుకు.. దశాబ్ద కాలంగా అల్లాడిన పేద ప్రజలను పట్టించుకోకుండా.. ఒకే గ్రామంలోనే ఇస్తారా అంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉంది అన్నారు. ప్రతి పథకాన్ని సంతృప్త స్థాయి(శాచ్యురేషన్ మోడ్)లో అమలు చేస్తాం అన్నారు. గత పది సంవత్సరాలు ప్రభుత్వాన్ని పాలకుల కోసమే వాడుకున్నారు.. ప్రజలను పట్టించుకోలేదు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా రాష్ట్ర క్యాబినెట్ మొత్తం సంపద సృష్టిస్తాం, పేద ప్రజలకు పంచుతాం అన్నారు. మన విధులు, జీవన విధానం, మనకు ఉన్న హక్కులు, సమాన అవకాశాలు కల్పిస్తూ బావ స్వేచ్ఛకు సంపూర్ణ హక్కు కలిగిస్తూ భారత రాజ్యాంగం అమలు చేసుకున్నామని, ఇది మన జీవన విధానమని అన్నారు.

పరమ పవిత్రమైన ఈ రోజు 4 నూతన పథకాలను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ నాలుగు పథకాల క్రింద సంవత్సరానికి ప్రజలకు 45 వేల కోట్లు అందించడం జరుగుతుందని అన్నారు. సాచురేషన్ పద్ధతిలో ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. గతంలో పాలకులు రైతు కూలీలు, పేదలకు ఇండ్ల గురించి ఆలోచన చేయలేదని అన్నారు. నేడు భూమి లేని రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేల ఆర్థిక సహాయం, ఇండ్లు లేని చివరి పేద కుటుంబానికి ఇండ్లు ఇచ్చేవరకు ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యం క్రింద సంపద సృష్టించి పేదలకు పంచడమే లక్ష్యమని అన్నారు. నాలుగు గోడల మధ్య లబ్ధిదారుల వివరాలు తయారు చేసే పద్ధతికి స్వస్తి చెప్పి గ్రామ సభలు నిర్వహించి పారదర్శకంగా ప్రజల మధ్యలో లబ్ధిదారులను ఎంపిక చేసామని అన్నారు. గ్రామసభలలో ప్రాథమిక జాబితాలో పేర్లు రాని వారి దగ్గర దరఖాస్తులు తీసుకుని, వాటిని కూడా విచారించి అర్హత ఉంటే పథకాలు అమలు చేస్తామని అన్నారు. పథకాల అమలు పట్ల కొంతమంది చేస్తున్న అసత్య ప్రచారాలు తిప్పి కొట్టాలని, చివరి లబ్ధిదారుడు వరకు పథకాలు చేరతాయని అన్నారు. జనవరి 26న ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి సాచురేషన్ పద్ధతిలో పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. నేడు మంజూరు పత్రం ఇచ్చిన ప్రతి రైతుకు, రైతు కూలీ బ్యాంకు ఖాతాలో సోమవారం నిధులు జమ అవుతాయని అన్నారు. గత పాలకులు లక్ష రూపాయల రుణమాఫీ చేయలేదని, తమ ప్రభుత్వం రెండు లక్షల వరకు రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేసి చూపించామని, సన్న రకం వడ్లకు 500 బోనస్ ఇచ్చామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ ల ఉచిత విద్యుత్, 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మెటిక్ చార్జీలు పెంపు వంటి అనేక కార్యక్రమాలు అమలు చేసామని అన్నారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు పూర్తి సహకారం అందిస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేశామని, ప్రభుత్వంలో అవకాశమున్న ప్రతిచోట మహిళలకు ఆదాయం లభించేలా చర్యలు చేపట్టామని అన్నారు. త్వరలోనే రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్నరకం బియ్యం సరఫరా చేస్తామని అన్నారు. గతంలో ఉన్న రైతుబంధు బకాయిలు కూడా ప్రజా ప్రభుత్వమే చెల్లించిందని, రైతులకు ఉచిత విద్యుత్ క్రింద విద్యుత్ సంస్థలకు 12 వేల కోట్ల రూపాయలు చెల్లిస్తున్నామని అన్నారు. ప్రజా సంపదకు కస్టోడియన్ గా ఉంటూ ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం మాత్రమే దానినీ వినియోగిస్తామని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోలు చివరి దశకు చేరిందని, 586 కోట్లతో సన్న రకం ధాన్యం కొనుగోలు చేశామని, 138 కోట్ల రూపాయలు రైతులకు బోనస్ చెల్లించామని అన్నారు. భూసార పరీక్షల దగ్గర నుంచి ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకుంటూ రైతు ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నామని, కూర గాయల, ఆయిల్ పామ్ సాగు పెంపుకు కృషి చేస్తున్నామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులు కల్పించామని అన్నారు. అభయ హస్తం గ్యారెంటీ పథకాలు, ఉచిత విద్యుత్, బస్సు ప్రయాణం మన జిల్లాలో విజయవంతంగా అమలు చేశామని అన్నారు. ప్రజలలో ఉన్న డిమాండ్ మేరకు నూతనంగా నాలుగు పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి పథకం చివరి లబ్ధిదారుడు వరకు పథకాలు చేరే వరకు చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామసభలలో చర్చించి పారదర్శకంగా పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు.



## బాలకృష్ణ ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపిన కిషన్ రెడ్డి

**అన్ని రంగాల్లో హిందూపురం ఎమ్మెల్యే విశేష సేవలు**

**రాజకీయ రంగంలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు**

**ఆయనను గుర్తించినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు..కేంద్రమంత్రి, సికింద్రాబాద్ ఎంపీ**

**హైదరాబాద్, మహా:** సినిమా హీరో బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆదివారం బాలకృష్ణ ఇంటికి వెళ్లి ఆయనను కలిసి పద్మ అవార్డుకు ఎంపికైనందుకు హిందూపురం ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. సినీ, రాజకీయ రంగాల్లో బాలకృష్ణ తనదైన ముద్ర వేశారన్నారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి చైర్మన్ గా ఉంటూ వేలాది మందికి వైద్య సేవలందిస్తున్నారంటూ బాలకృష్ణను కొనియాడారు. ఈ విధంగా అనేక రంగాల్లో విశేష సేవలందిస్తున్న నందమూరి బాలకృష్ణకు పద్మ భూషణ్ అవార్డును ప్రకటించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు

**దక్షిణ భాగంపై కీలక అప్డేట్.. కన్సల్టెన్సీ కోసం టెండర్ పిలిచిన సర్కార్**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చేందుకు గాను హైదరాబాద్ చుట్టూతా రీజినల్ రింగు రోడ్డును ప్రాజెక్టును నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఉత్తర, దక్షిణ భాగాలుగా మొత్తం 350 కి.మీ పరిధితో రహదారిని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు దాదాపు 40 కి.మీ దూరంతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. ఇప్పటికే 161 కి.మీతో నిర్మిస్తున్న ఉత్తర భాగానికి కేంద్రం టెండర్లు ఆహ్వానించింది. త్వరలోనే టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇక దక్షిణ భాగం పనులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. ఆర్థిక నిర్వహణ, ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ), వ్యూహాత్మక రోడ్డు మ్యాప్ డిజైన్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు సలహాలు, సూచనలు అందించడానికి రేవంత్ సర్కార్ తాజాగా మరో కన్సల్టెన్సీ సంస్థ కోసం టెండర్లను పిలిచింది. కన్సల్టెన్సీ సంస్థలు బిడ్లను సమర్పించడానికి ఫిబ్రవరి నెల 25న మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం కల్పించారు. ఇందులో రీజినల్ రింగు రోడ్డు దక్షిణ భాగం నిర్మాణానికి కావాల్సిన నిధులను ఏ విధంగా సమకూర్చుకోవాలి? ఏ విధంగా ఖర్చు చేయాలి ? తదితర అంశాలతో పాటు సౌత్ పార్ట్ రోడ్డు మ్యాప్, ఇరువైపుల రోడ్డు ఎలైన్‌మెంట్ ఎలా ఉండాలి? భూసేకరణ అంశాలు, వీటి పర్యవేక్షణ కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు? వంటి బాధ్యతలను ఎంపికైన కన్సల్టెన్సీ సంస్థకు ప్రభుత్వం అప్పగించనుంది. ఉత్తర భాగం



పనులకు సమాంతరంగా దక్షిణ భాగం పనులను కూడా చేపట్టేందుకు సర్కార్ సిద్ధమైంది. గత ఏడాది డిసెంబరు 28న ఉత్తర భాగం పనులను చేపట్టడానికి కేంద్రం టెండర్లను ఆహ్వానించింది. ఈ పనులను ఐదు ప్యాకేజీల్లో డిసైడ్ అయ్యారు. నాలుగు వరుసల రహదారితో గ్రీన్‌ఫీల్డ్ రీజినల్ ఎక్స్‌ప్రెస్‌వేగా ఈ రోడ్డును భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ఏఐ) అభివృద్ధి చేయనుంది. ఈ టెండర్లకు ఫిబ్రవరి నెల 14 వరకు బిడ్‌లను దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. అదే నెల 17న బిడ్లను తెరవనున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయితే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు వెంటనే ప్రారంభమవుతాయి. కేంద్రం చేపట్టే ఉత్తరభాగం పనులకు సమాంతరంగా దక్షిణభాగం పనులను కూడా తామే చేపడుతామని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అందులో భాగంగానే తాజాగా కన్సల్టెన్సీ టెండర్లను పిలిచినట్లు తెలుస్తోంది. కాగా, ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సగం తెలంగాణ అభివృద్ధి చెందుతుంది. 60 శాతం వరకు పట్టణీకరణ పూర్తవుతుందని సర్కార్ భావిస్తోంది.

## వ్యవసాయరంగానికి ప్రజాప్రభుత్వం పెద్దపీట

- సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- వ్యవసాయాన్ని రాష్ట్ర ఆర్థిక రంగానికి వెన్నముకగా మార్చిన ప్రభుత్వం
- అనతి కాలంలోనే 25 లక్షల మందికిపైగా రైతుల రుణాలు మాఫీ
- యువత సాధికారత కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనిర్సిటీ



**హైదరాబాద్:** వ్యవసాయాన్ని రాష్ట్ర ఆర్థిక రంగానికి వెన్నెముకగా ప్రజాప్రభుత్వం మార్చిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం తెలంగాణ సంస్కృతికి పెద్దపీట వేస్తుంది. అందెశ్రీ రాసిన జయజయహే గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించాం. వ్యవసాయం రాష్ట్ర ఆర్థికరంగానికి వెన్నెముక. రైతులను ఆదుకునేందుకు రుణమాఫీ చేశాం. 25 లక్షల మందికిపైగా రైతుల రుణాలు మాఫీ చేశాం. ప్రజా ప్రభుత్వం కర్షకులకు రైతు భరోసా అందిస్తుంది. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నాం. సన్నరకం బియ్యానికి బోనస్ అందించాం. 2024 వానాకాలంలో 1.59 కోట్ల టన్నుధ్యానం ఉత్పత్తి చేశాం. ఉచిత బస్సు రవాణాతో మహిళలకు రూ.4500 కోట్లు ఆదాచేశామని చెప్పారు. 50 లక్షల పేద కుటుంబాలకు గృహజ్యోతి అందిస్తున్నాం. యువత సాధికారత కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనిర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని గవర్నర్ అన్నారు.

## ఐడెంటిఫికేషన్ పరేడ్‌లో సరైన వ్యక్తినే గుర్తించా

**ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు**

గత ప్రభుత్వ హయాంలో సీఐడీ కస్టడీలో రఘురామకు చిత్రహింసలు

కామేపల్లి తులసిబాబుపై రఘురామ అనుమానం

గుంటూరు జిల్లా జైలులో ఐడెంటిఫికేషన్ పరేడ్

రఘురామ ముందుకు తులసిబాబు, భారీ పర్సనాలిటీ ఉన్న కొందరు వ్యక్తులు

**గుంటూరు, మహా :** ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును గత ప్రభుత్వ హయాంలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కామేపల్లి తులసిబాబును పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. తులసిబాబును గుంటూరు కోర్టు మూడ్రోజుల పోలీసు కస్టడీకి అప్పగించింది. అయితే, తులసిబాబు తానే తప్పు చేయలేదని చెబుతుండడంతో, నిందితుడ్ని గుర్తించేందుకు ఆదివారం గుంటూరులో ఐడెంటిఫికేషన్ పరేడ్ ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియకు రఘురామ కృష్ణరాజు స్వయంగా హాజరయ్యారు. తన ముందు ప్రవేశపెట్టిన కొందరు వ్యక్తుల్లో ఆయన నిందితుడ్ని గుర్తించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు గుంటూరు జిల్లా జైలులో ఐడెంటిఫికేషన్ పరేడ్ పూర్తయిందని వెల్లడించారు. జిల్లా జడ్జి సమక్షంలో నిందితుడ్ని గుర్తించానని తెలిపారు. ఈ పరేడ్ లో తన ముందు ఏడుగురిని ప్రవేశపెట్టారని, వారిలో... ఆ రోజు నా ఛాతీపై కూర్చున్న వ్యక్తిని గుర్తించానని రఘురామ స్పష్టం చేశారు. సుమారు గంటపాటు ఈ పరేడ్ జరిగిందని, న్యాయమూర్తి ఎదుట వాంగ్మూలం ఇచ్చానని వివరించారు. సరైన వ్యక్తినే గుర్తించానని భావిస్తున్నానని చెప్పారు.

నేను గుర్తించిన వ్యక్తి (తులసిబాబు)చరిత్ర గుడివాడ వాళ్లకే కాదు, పక్కనున్న ప్రకాశం జిల్లా వాళ్లకు కూడా తెలుసన్నారు. అప్పట్లో సీఐడీ చీఫ్ గా ఉన్న సునీల్ కుమార్ రూమ్ లోకి వెళ్లాలంటే ఎవరైనా పర్మిషన్ తీసుకుని వెళ్లాలి, కానీ, ఇతడు డైరెక్ట్ గా డోర్ తీసుకుని వెళ్లేవాడని, సునీల్ కుమార్ రూమ్ లోకి ఇతడు ఎంటరైతే, అప్పటికే లోపల ఎవరైనా ఆఫీసర్లు ఉంటే వారు బయటికి వచ్చేయాలి, ఇతను వెయిటింగ్ కూడా చేసేవాడు కాదు, అత్యంత ఆత్మీయుడని సీఐడీ ఆఫీసంతా



అనుకోవడం, నాకు చెప్పడం జరిగిందన్నారు. పైగా, ఇతడ్ని లీగల్ అడ్వైజర్ గా కూడా తీసుకున్నట్టు పేపర్లో కూడా వచ్చిందని గుర్తు చేశారు. అతడు దరఖాస్తు చేసుకున్నాడట... మరి సునీల్ కుమార్ ఇతడి క్వాలిఫికేషన్ చూశాడో, ఇతడి పర్సనాలిటీ నచ్చిందో కానీ సెలెక్ట్ చేశాడు అని వివరించారు. కాగా, తులసిబాబుతో పాటు అదే ఎత్తు, అదే బరువుతో ఉండే కొందరు వ్యక్తులను ఈ ఐడెంటిఫికేషన్ పరేడ్ లో రఘురామ ముందుకు అధికారులు తీసుకు వచ్చినట్టు తెలుస్తోంది. 2021లో తనను సీఐడీ అదుపులోకి తీసుకున్నప్పుడు, తన ఛాతీపై వంద కిలోలకు పైగా బరువున్న వ్యక్తి కూర్చున్నాడని కొందరు చెప్పారని, ఆ వ్యక్తిని తాను కామేపల్లి తులసిబాబు అని భావిస్తున్నానని రఘురామ పోలీసులకు తెలిపారు. తులసిబాబును గుర్తించేందుకు ఐడెంటిఫికేషన్ పరేడ్ ఏర్పాటు చేయాలంటూ రఘురామ ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ కు లేఖ రాశారు. ఈ క్రమంలోనే గుంటూరు జిల్లా జైలులో ఐడెంటిఫికేషన్ పరేడ్ ఏర్పాటు చేశారు.

## పంట పొలంలో జాతీయ జెండా ఎగరవేసి దేశభక్తిని చాటుకున్న రైతు

**మహా:** 76 రిపబ్లిక్ డే వేడుకలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలానికి చెందిన ఓ రైతు తన పంట పొలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. వరి పంట పంట పొలంలో జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటుకున్నారు. పొలంలో జాతీయ జెండా తోరణాలు, వరినారుతో భారతదేశ ఆకృతిలో ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం ఇంటర్నెట్ లో వైరల్ అవుతోంది. రైతుకు నెటిజన్స్ అభినందనలు తెలుపుతున్నారు.

## రాజ్ భవన్‌లో ఎట్ హోమ్

**హాజరైన సీఎం రేవంత్,మంత్రులు**

**ప్రతిభా పురస్కారాలను అందజేసిన గవర్నర్**

**హైదరాబాద్,మహా ;** గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్ భవన్ లో ఎట్ హోమ్ కార్యక్రమం జరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇచ్చిన 'తేనీటి విందు' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి; తెలంగాణ రాష్ట్ర హైకోర్టు యాక్టింగ్ ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్; కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, జి కిషన్ రెడ్డి; కన్హా శాంతివనం వ్యవస్థాపకులు కమలేష్ డి పటేల్; రాష్ట్ర మంత్రులు; పలువురు ఎంపీలు; ఎమ్మెల్యేలు; ఉన్నతాధికారులు; అనేక మంది రాష్ట్ర ప్రముఖులు హాజరయ్యారు. ముందుగా, ఈ కార్యక్రమంలో 'గవర్నర్ ప్రతిభా పురస్కారాలు 2024' కు ఎంపికైన సభ్యులకు గవర్నరు చేతుల మీదుగా అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది.

**గవర్నర్ ప్రతిభా పురస్కారాలు 2024 అవార్డులకు ఎంపికైన సభ్యులు:** ప్రత్యేక జీవితకాల సాఫల్య పురస్కారం: డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి, ఐ.ఎఫ్.ఎస్., (పర్యావరణ పరిరక్షణ),

**వ్యక్తిగత విభాగము:** దుశర్ల సత్యనారాయణ (పర్యావరణ పరిరక్షణ) అరికపూడి రఘు (వికలాంగుల సంక్షేమం) జీవన్‌జీ దీప్తి (ఆటలు మరియు క్రీడలు) పి.బి. కృష్ణ భారతి (సంస్కృతి) ప్రొఫెసర్ యం. పాండు రంగారావు (సంస్కృతి)

**సంస్థాగత విభాగము:** ధ్రువాంశ్ ఆర్గనైజేషన్ (పర్యావరణ పరిరక్షణ), ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ (వికలాంగుల సంక్షేమం), ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఆటలు మరియు క్రీడలు) ,సంస్కృతి ఫౌండేషన్ (సంస్కృతి) లు ఉన్నారు.

## మంత్రి పొంగులేటి పర్యటనలో ఉద్రిక్తత

**జనగామలో పోలీసుల లాఠీ-ఛార్జ్.. పలువురికి గాయాలు**

**పోలీసుల తీరుపై పల్లా నిరసన**



**జనగామ, మహా:** జనగామ జిల్లాలో ఉద్రిక్తత చోటు చేసుకుంది.. మంత్రి పొంగులేటి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన సభ దగ్గరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి రావడంతో టెన్షన్ నెలకొంది. సభకు రాకుండా అక్రమంగా అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులను సభకు అనుమతించాలని డీసీపీ రాజ మహేంద్ర నాయక్ ను ఎమ్మెల్యే పల్లా కోరారు . ఈ క్రమంలో జై కాంగ్రెస్, పల్లా గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు . కాంగ్రెస్ కార్యకర్తలకు పోటీగా జై పల్లా అంటూ పోటాపోటిగా బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ క్రమంలో అక్కడే ఉన్న పోలీసులు ఇరు వర్గాలను చెదరగొడుతూ నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ పరిస్థితి కంట్రోల్ అవ్వకపోవడంతో లాఠీచార్జ్ చేశారు. పలువురు బిఆర్ఎస్ కార్యకర్తలకు గాయాలయ్యాయి. పోలీసుల లాఠీఛార్జీని ఎమ్మెల్యే పల్లా తీవ్రంగా ఖండించారు.

## బీఆర్ఎస్ ఆరోపణలపై నిలదీసిన సీఎం రేవంత్ రెడ్డి

**నారాయణపేట, మహా :** తన సోదరుడు తిరుపతి రెడ్డి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటే తప్పేంటని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తాను రాష్ట్ర పనుల్లో బిజీగా ఉన్న నేపథ్యంలో నియోజవర్గానికి సంబంధించిన పనులను తన సోదరుడు తిరుపతి రెడ్డి చూసుకుంటున్నాడని స్పష్టం చేశారు. తాను పాలన బాధ్యతల్లో మునిగిపోతుండటం వల్ల నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా తిరుపతి రెడ్డి అందుబాటులో ఉంటున్నారన్నారు. ఇదేదో థప్పు, చేయరాని ఫని చేస్తున్నట్లుగా ప్రతిపక్ష పార్టీ పదే పదే మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నాకు నియోజకవర్గ ప్రజలు ఓట్లేసి గెలిపించారు, వారి యోగ క్షేమాలు, కష్టసుఖాలను తెలుసుకోవాల్సిన బాధ్యత కూడా తన కుటుంబంలోని ఒకరు తీసుకోవద్దా, ఓట్లేసి గెలిపించిన పాపానికి నా నియోజకవర్గ ప్రజలను పట్టించుకోకుండా వదిలేయాలా అని నిలదీశారు. ఎలాంటి పదవి లేకపోయిన తిరుపతి రెడ్డి ఎందుకు పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ లబోదిబోమంటుందని రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ప్రజా సేవ చేసేందుకు పదవి ఉండాల్సిన అవసరం లేదని ఎలాంటి హోదా లేకుండానే నియోజకవర్గ ప్రజల సమస్యలు, ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ఒక పదవి, కేటీఆర్, కవిత, హరీష్ రావు ఇలా ఒక్కొక్కరు ఒక్కో పదవి తీసుకుని దోచుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కానీ ఇప్పుడు ఎలాంటి పదవి లేకుండానే తన సోదరుడు తిరుపతి రెడ్డి ప్రజలకు సేవ చేస్తున్నారని గుర్తు చేశారు.

## మున్సిపాలిటీల్లో స్పెషల్ ఆఫీసర్లు

**ముగిసిన పాలక వర్గాల పదవీకాలం**

**ప్రభుత్వ ఉత్తర్వులు జారీ**

**నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన**

**హైదరాబాద్, మహా:** మున్సిపాలిటీల్లో నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 130 మున్సిపాలిటీల్లో పాలక వర్గాల పదవీకాలం ఆదివారంతో ముగిసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. నేటి నుంచి ఆయా మున్సిపాలిటీల్లో ప్రత్యేక అధికారులు ఉద్యోగ బాధ్యతలను చేపటనున్నారు.

ఇదిలా ఉంటే, రాష్ట్రంలో 142 మున్సిపాలిటీలు ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల 12 మున్సిపాలిటీలను కొత్తగా ఏర్పాటు చేసింది. దీంతో ఆ సంఖ్య 154కు చేరింది. అయితే 2020లో 130 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. కరీంనగర్, మేడ్చల్ కు మాత్రం ఈ నెల 27వరకు సమయం ఉంది. గ్రేటర్ హైదరాబాదు, గ్రేటర్ వరంగల్, ఖమ్మం, అచ్చంపేట, కొత్తూరు, నకిరేకల్, సిద్దిపేట, జడ్చర్ల మున్సిపాలిటీలకు మాత్రం 2021లో ఎన్నికలు జరిగాయి. మరో నాలుగు మున్సిపాలిటీలు ఏజెన్సీ పరిధిలో ఉన్న పాల్వంచ, మణుగూరు, మందమర్రి, జహీరాబాద్ లకు అసలు ఎన్నికలే నిర్వహించలేదు.

# మారుతి బ్రెజా సహా ఆ నాలుగు కార్లకు పోటీ..

## 27 నుంచి స్కోడా కైలాక్ డెలివరీ ప్రారంభం.. ఇవీ స్పెసిఫికేషన్స్..!




జెక్ కార్ల తయారీ సంస్థ స్కోడా (Skoda) తన సబ్ కంపాక్ట్ ఎస్‌యూవీ కైలాక్ (Kylaq) కార్ల డెలివరీ సోమవారం నుంచి ప్రారంభించనున్నది. గతేడాది నవంబర్‌లో భారత్ మార్కెట్లో స్కోడా తన కైలాక్ కారును ఆవిష్కరించింది. దీని ధర రూ.7.89 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. భారత్‌లో విక్రయిస్తున్న స్కోడా కార్లలో కైలాక్ మూడవది. స్కోడా దేశీయ కార్ల విక్రయాల్లో స్కోడా కుషాక్, స్కోడా స్లావియా మోడల్ కార్లకు దాదాపు 30 శాతం వాటా ఉంది. ఈ నేపథ్యంలోనే స్కోడా తన కైలాక్ కారును భారత్ మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. స్కోడా కుషాక్, స్కోడా స్లావియక్లా ఇప్పటికే దేశంలోని ప్రథమ శ్రేణి నగరాల్లో విస్తరించి ఉన్నాయి. తాజాగా వస్తున్న కైలాక్ కారుతో ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాలకు తమ బ్రాండ్ విస్తరించాలని స్కోడా భావిస్తోంది.

స్కోడా స్కైలాక్ రూ.7.89 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమై స్కోడా కైలాక్ ప్రెస్టేజ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ రూ.14.40 లక్షల (ఎక్స్ షోరూమ్) వరకూ పలుకుతుంది. మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ కైలాక్ ప్రెస్టేజ్ రూ.13.35 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలకుతుంది. సిగ్నేచర్ మాన్యువల్ వేరియంట్ రూ.9.59 లక్షలు (ఎక్స్ షోరూమ్), సిగ్నేచర్ + మాన్యువల్ వేరియంట్ రూ. 11.40 లక్షలు (ఎక్స్ షోరూమ్), సిగ్నేచర్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ వేరియంట్ రూ.10.59 లక్షలు (ఎక్స్ షోరూమ్), సిగ్నేచర్+ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ వేరియంట్ రూ.12.40 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. స్కోడా కైలాక్ కారు బుల్లి ఎస్‌యూవీ కారు కానున్నది. ఇది మారుతి సుజుకి బ్రెజా, టాటా నెక్సాన్, కియా సోనెట్, హ్యుండాయ్ వెన్యూ వంటి కార్లతో పోటీ పడుతుంది. స్ప్లిట్ హెడ్ ల్యాంప్స్, బాక్సీ ప్రొఫైల్, షార్ట్ ఓవర్‌హ్యాంగ్స్‌తో మోడర్న్ సాలిడ్ డిజైన్‌తో వస్తోంది. బట్టర్‌ఫ్లై గ్రిల్లె, టాప్ ట్రిమ్స్‌లో 17 అంగుళాల అల్లాయ్ వీల్స్, ఎల్ఈడీ డీఆర్ఎల్స్, హెడ్ ల్యాంప్స్ ప్రామాణికంగా ఉంటాయి. స్కోడా కైలాక్ కారు డిజిటల్ క్లస్టర్, 10.1అంగుళాల సెంట్రల్ టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్, వైర్ లెస్ ఆపిల్ కార్ ప్లే, ఆండ్రాయిడ్ ఆటో వంటి ఫీచర్లు ఉంటాయి. ఎంట్రీ లెవల్ వర్షన్లలో 5అంగుళాల టచ్‌స్క్రీన్, సెమీ డిజిటల్ క్లస్టర్ ఉంటుంది. సిక్స్‌వే ఎలక్ట్రిక్ సీట్స్ విత్ వెంటిలేసన్ ఫర్ ది ఫ్రంట్ రో, వేరియంట్లను బట్టి సింగిల్ అండ్ డ్యుయల్ టోన్ ఆప్షన్లతో క్యాబిన్ ఉంటుంది. క్లాసిక్, సిగ్నేచర్, సిగ్నేచర్ + వేరియంట్లలో వేర్వేరు ఫ్యాబ్రిక్ అప్‌హోల్‌స్టరీ, టాప్ స్పెక్ ప్రెస్టీజ్ ట్రిమ్‌లో లెథరట్టే సీట్లు, అదనంగా వేరియంట్ల ఆధారంగా ఎలక్ట్రిక్ సన్‌రూఫ్ వస్తుంది. స్కోడా కైలాక్ కారు 1.0 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో వస్తోంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 114 బీహెచ్‌పీ విద్యుత్, 178 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. హయ్యర్ ఎండ్ వేరియంట్లలో సిక్స్ స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ లేదా సిక్స్ స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లలో లభిస్తుంది. బేసిక్ క్లాసిక్ వేరియంట్ స్కోడా కైలాక్ కారు మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌లోనే లభిస్తుంది. 25కి పైగా యాక్టివ్ అండ్ పాసివ్ సేఫ్టీ ఫీచర్లు, సిక్స్ ఎయిర్ బ్యాగ్స్, మల్టీ కొల్లిషన్ బ్రేక్, రోల్ ఓవర్ ప్రొటెక్షన్, ఎలక్ట్రానిక్ డిఫరెన్షియల్ లాక్, యాంటీ లాక్ బ్రేక్స్ విత్ ఈబీడీ, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ తదితర ఫీచర్లు ఉంటాయి.

### కేంద్రం బంపరాఫర్..

# ఆ వెహికల్ స్క్రాపింగ్ చేస్తే మోటార్ వెహికల్ టాక్స్ సగం మాఫీ.. !

అధిక కాలుష్యం వెలువరించే వాహనాలను వదిలించుకునేందుకు కేంద్ర రవాణాశాఖ ఆకర్షణీయ రాయితీలు ప్రతిపాదిస్తోంది. బీఎస్2 సహా పాత కాలుష్య నియంత్రణ ప్రమాణాలతో తయారైన వాహనాలను స్క్రాప్‌కు పంపి కొత్త వాహనాలు కొనుగోలు చేసే వారికి వన్ టైం టాక్స్ మీద డబుల్ రిబేట్ కల్పిస్తామని ప్రతిపాదించింది. గరిష్టంగా 50 శాతం రాయితీ కల్పిస్తానమి తెలిపింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం పాత వాహనాలను స్క్రాపేజ్ కింద తొలగించి కొత్త వాహనాలు కొనుగోలు చేస్తే మోటార్ వెహికల్ టాక్స్ మీద 25 శాతం డిస్కౌంట్ ఆఫర్ చేస్తోంది. అదీ కూడా వాణిజ్య వాహనాలకు 15 శాతం రాయితీ మాత్రమే కల్పిస్తోంది. పాత వాహనాలను స్క్రాప్ కింద తొలగించే వారికి 50 శాతం వరకూ మోటార్ వెహికల్ టాక్స్‌లో రాయితీ కల్పించాలని ప్రతిపాదిస్తూ కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. బీఎస్ 1 ప్రమాణాలతో తయారైన వాహనాలకు కూడా ఈ రాయితీ వర్తిస్తుంది. కమర్షియల్, వ్యక్తిగత వాహనాలకూ ఇదే రాయితీ అమలు చేస్తామని కేంద్ర రవాణా శాఖ తెలిపింది. 2000లో బీఎస్1, 2002 నుంచి బీఎస్2 ప్రమాణాలు అమల్లోకి వచ్చాయి. స్వచ్ఛంద వాహన ఆధునీకరణ కార్యక్రమం లేదా వెహికల్ స్క్రాపింగ్ పాలసీని కేంద్ర రవాణాశాఖ ప్రారంభించింది. దీని కింద దేశవ్యాప్తంగా రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీస్ (ఆర్‌వీఎస్ఎఫ్), ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్స్ (ఏటీఎస్) ఏర్పాటు చేస్తోంది.



# అమెరికాకు ఎగుమతుల్లో 5.57 శాతం వృద్ధి.. ట్రంప్ రాకతో పురోగతిపై ఆశలు..!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ భారత్ ఎగుమతులు 5.57శాతం పెరిగి రూ.59.93 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దేశీయ ఉత్పత్తులకు అమెరికాలో ఆరోగ్యకరమైన గిరాకీ ఉందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేవలం డిసెంబర్ నెలలోనే ఎగుమతులు 8.49 శాతం వృద్ధి చెంది ఏడు బిలియన్ డాలర్ల వద్ద నిలిచాయి. మరోవైపు, అమెరికా నుంచి దిగుమతులు 1.91శాతం పెరిగి 33.4 బిలియన్ డాలర్లకు చేరితే, డిసెంబర్ లోనే 9.88 శాతం వృద్ధితో 3.77 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడ్డాయి. మున్ముందు భారత్, అమెరికా మధ్య వాణిజ్యం మరింత పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమెరికా, భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం కింద 93.4 బిలియన్ డాలర్ల లావాదేవీలు జరిగాయి. ఇదే కాలంలో భారత్ చైనా మధ్య 94.6 బిలియన్ డాలర్ల లావాదేవీలు నమోదయ్యాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టడంతో అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం మరింత ముదిరే అవకాశం ఉంది. దీనివల్ల భారత ఉత్పత్తులకు మరింత గిరాకీ పెరుగుతుందని భావిస్తున్నారు. 2021-22 నుంచి భారత్‌కు అమెరికా అతిపెద్ద వ్యాపార భాగస్వామిగా ఉంది.

# గూగుల్ క్రోమ్ యూజర్లకు వార్నింగ్ ఇచ్చిన కేంద్రం..!



గూగుల్ క్రోమ్ సెర్చ్ ఇంజిన్ వాడుతున్న విండోస్, మాక్ యూజర్లకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. గూగుల్ క్రోమ్‌లో రెండు తీవ్రస్థాయిలో లోపాలు ఉన్నాయని.. అవి హ్యాకర్స్‌కు అవకాశంగా మారే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వంలో నడిచే కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ పేర్కొంది. పీసీలు, ల్యాప్‌టాప్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ యూజర్స్‌తో పాటు మాక్ యూజర్లు అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. స్మార్ట్ ఫోన్స్ యూజర్స్‌కు దాంతో పెద్దగా నష్టం ఉండకపోవచ్చని చెప్పింది. గూగుల్ క్రోమ్‌లోని లోపాలతో ఆయా కంప్యూటర్స్ హ్యాకర్ల బారినపడే ప్రమాదం ఉంటుందని.. దాంతో సమాచారాన్ని తస్కరించే అవకాశాలుంటాయని సెర్ట్ తెలిపింది. హ్యాకర్స్ నుంచి తప్పించుకునేందుకు యూజర్లు తప్పనిసరిగా.. గూగుల్ క్రోమ్‌ని అప్‌డేట్ చేయాలని సూచించింది. క్రోమ్ సెక్యూరిటీ ప్యాచ్‌లు వస్తే.. వెంటనే అప్‌డేట్ చేయాలని చెప్పింది. ముఖ్యంగా.. 132.0.6834.83/8r, 132.0.6834.110/111కు ముందు వెర్షన్ గూగుల్ క్రోమ్‌ని వాడుతున్నట్లయితే తప్పనిసరిగా అప్‌డేట్ చేయాల్సిందేనని సెర్ట్ చెప్పింది. ఓపెన్ సోర్స్ ఆపరేటింగ్ సిస్టమ్ లినక్స్ యూజర్లు 132.0.6834.110 వెర్షన్‌కు ముందు క్రోమ్ వాడుతున్నట్లయితే.. లేటెస్ట్ వెర్షన్‌కు మారాలని పేర్కొంది.

# గగనతలంలో ఇస్రో గేమ్ ఛేంజర్‌గా ఇస్రో : షార్ డైరెక్టర్ రాజరాజన్



భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో గగనతలంలో మరోసారి గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని షార్ డైరెక్టర్ ఏ రాజరాజన్ పేర్కొన్నారు. శ్రీహరికోటలోని భాస్కర్ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచం మొత్తాన్ని భారత్ వైపు చూసేలా ఇస్రో చేసిందన్నారు. డిసెంబర్ 30న ప్రయోగించిన పీఎస్ఎల్వీ సీ60 రాకెట్ విజయవంతంగా రెండు ఉపగ్రహాలను ప్రవేశపెట్టి.. స్పేస్‌లోనే విజయవంతంగా డాకింగ్ ప్రక్రియను విజయవంతం చేసింది. కాస్త ఆలస్యమైనా.. ఇస్రో శాస్త్రవేత్తలు దిగ్విజయంగా డాకింగ్ ప్రక్రియను నిర్వహించారన్నారు. ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణ ఆధ్వర్యంలోనే ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగిందని తెలిపారు. శ్రీహరికోటలో మూడో లాంచ్‌ప్యాడ్ ఏర్పాటుకు రూ.3,984.86 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. దాంతో భవిష్యత్‌లో భారీ ఉపగ్రహాలను ఇస్రో రాకెట్ల ద్వారా ఉపయోగించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే షార్‌లో రెండు లాంచ్ ప్యాడ్లు ఉన్నాయని గుర్తు చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని మూడో ప్రయోగ వేదికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సూళ్లూరుపేట, శ్రీహరికోటతో పాటు నెల్లూరు, తిరుపతి జిల్లాల వారికి మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జనవరి 29న ఇస్రో వందో ప్రయోగం చేపట్టబోతుందన్నారు. అంతకు ముందు ఆయన శ్రీహరికోట స్పేస్ సెంటర్ పాఠశాల ఆవరణలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు.

## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL

# ప్రియురాలి నెలల కుమారుడ్ని చంపిన 15 ఏళ్ల బాలుడు



**అహ్మదాబాద్:** ప్రియురాలికి చెందిన నెలల కుమారుడ్ని ఒక బాలుడు హత్య చేశాడు. బెడ్ పైనుంచి పడటంతో తలకు గాయమై చనిపోయినట్లు నమ్మించాడు. ఆ మరునాడు అతడు పారిపోవడంతో అనుమానించిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో శిశువు మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించడంతో అసలు విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో ఆ బాలుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేరళకు చెందిన 22 ఏళ్ల మహిళకు ఒక వ్యక్తితో పెళ్లైంది. అతడు వదిలేయడంతో గురుగ్రామ్‌లోని సోదరి వద్దకు ఆమె చేరింది. అక్కడ 15 ఏళ్ల బాలుడితో ఆ మహిళకు పరిచయం ఏర్పడింది. సన్నిహితం పెరుగడంతో వారిద్దరూ ఇంటి నుంచి పారిపోయారు. మహారాష్ట్రలోని థాణేకు చేరుకున్నారు. వదిలేసిన భర్త ద్వారా గర్భం దాల్చిన ఆ మహిళ అక్కడ బాబుకు జన్మనిచ్చింది. అనంతరం వీరిద్దరూ కలిసి గుజరాత్‌లోని వల్సాద్ జిల్లాకు చేరుకున్నారు. ఉమర్గామ్‌లోని అద్దె ఇంట్లో పిల్లాడితో కలిసి నివసిస్తున్నారు. కాగా, జనవరి 13న ఆ మహిళ తన నాలుగు నెలల కుమారుడ్ని ఆ యువకుడికి అప్పగించింది. బట్టలు కొనేందుకు మార్కెట్‌కు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి ఆమె బిడ్డ మరణించాడు. మంచం పైనుంచి పడటంతో తలకు గాయమై ఆ పసి బాబు మరణించినట్లు అతడు చెప్పాడు. ఈ నేపథ్యంలో వారిద్దరూ కలిసి చిన్నారి మృతదేహాన్ని ఖననం చేశారు. మరోవైపు ఆ మరునాడు యువకుడు ఇంటి నుంచి పారిపోయాడు. దీంతో తన నాలుగు నెలల కుమారుడ్ని ప్రియుడు చంపి ఉంటాడని ఆ మహిళ అనుమానించింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఖననం చేసిన శిశువు మృతదేహాన్ని పోలీసులు వెలికితీశారు. పోస్ట్‌మార్టం నిర్వహించగా తలకు తీవ్ర గాయాలతో పసి బాబు మరణించినట్లు తేలింది. కాగా, పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. పారిపోయిన యువకుడు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో ఉన్నట్లు తెలుసుకున్నారు. అక్కడకు వెళ్లి అరెస్ట్ చేసి గుజరాత్‌కు తీసుకువచ్చారు. ఆ బాలుడ్ని ప్రశ్నించగా ప్రియురాలి పసి బాబు తలను నేలకేసి కొట్టి చంపినట్లు ఒప్పుకున్నాడు. ఆ బిడ్డను తనకు అప్పగించి ఆ మహిళ పనికి వెళ్లడం, కుమారుడున్న ఆమెతో పెళ్లికి తన కుటుంబం ఒప్పుకోదని భావించి అడ్డు తొలగించుకునేందుకు ఈ పని చేసినట్లు చెప్పాడు. ఈ నేపథ్యంలో ఆ యువకుడ్ని అదుపులోకి తీసుకుని జువెనైల్ హోమ్‌కు తరలించారు. అతడి వయస్సును నిర్ధారించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.




# గణతంత్ర దినోత్సవానికి వెళ్తుండగా వ్యాన్ బోల్తా..

## ఒక విద్యార్థి మృతి, 23 మందికి గాయాలు

**భువనేశ్వర్:** గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి వెళ్తున్న విద్యార్థుల వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒక స్టూడెంట్ మరణించగా డ్రైవర్‌తో సహా 23 మంది గాయపడ్డారు. ఒడిశాలోని సుబర్ణపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అథాగఢ్‌లోని నార్త్ బంకి మాలా బీహార్‌పూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు సారందా మైదానానికి వ్యానులో బయలుదేరారు. ఆ వాహనం ముందు టైర్ వదులుగా ఉండటంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో ఆ వ్యాను బోల్తాపడింది.

కాగా, ఈ ప్రమాదంలో ఒక విద్యార్థి అక్కడికక్కడే మరణించాడు. డ్రైవర్, ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా, మిగతా విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని కటక్‌లోని ఎస్‌సీబీ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

# ఆ ఊళ్లో తొలిసారి రిపబ్లిక్ డే

## నక్సల్స్ ప్రభావిత పల్లెలో గ్రామస్థుల సంబరం



**న్యూఢిల్లీ, జనవరి 26:** దేశం యావత్తు జనవరి 26 వేడుకల్ని ఘనంగా జరుపుకుంది. అయితే ఛత్తీస్‌గఢ్‌లోని ఓ గ్రామ ప్రజల ఆనందం అంతా ఇంతా కాదు. ఎందుకంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆ గ్రామంలో తొలిసారి జాతీయ పతాకం ఎగిరింది. సుక్మా జిల్లా తుముల్‌పాడ్ గ్రామం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భారత్ మాతాకీ జై, జై హింద్.. అంటూ పిల్లలు, పెద్దలు, యువకులు నినాదాలు చేశారు. సంతోషంతో స్వీట్లు పంచుకున్నారు. ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకోగా, సీఆర్‌పీఎఫ్ నేతృత్వంలో గ్రామస్థులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

# ప్రముఖ వైద్యుడు చెరియన్ కన్నుమూత

## భారత్‌లో బైపాస్ గ్రాఫ్ట్ సర్జరీ చేసిన తొలి సర్జన్



**చెన్నై:** ప్రముఖ గుండె శస్త్ర చికిత్స నిపుణుడు కేఎం చెరియన్(80) కన్నుమూశారు. శనివారం బెంగళూరులో ఓ ఫంక్షన్‌కు హాజరైన ఆయన కుప్పకూలి చనిపోయారు. దేశంలో 50 ఏండ్ల క్రితం గుండెకు తొలి కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్ట్ (ధమనుకు సంబంధించిన సర్జరీ) చేసిన వైద్యుడిగా చెరియన్ ఘనత సాధించారు. చెరియన్ మృతి తీరని విషాదమని భారత గుండె శస్త్ర చికిత్స నిపుణుల మండలి అధ్యక్షుడు రాజేశ్ రాజన్ తెలిపారు. వైద్య రంగంలో భవిష్యత్తు ఆవిష్కరణలపై చెరియన్‌తో ఇటీవలే చర్చించానని డబ్ల్యూహెచ్‌వో మాజీ శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్ ఆవేదన వ్యక్తం చేశారు.



# గులియన్-బారే సిండ్రోమ్‌తో ఒకరు మృతి..

## మహారాష్ట్రలో తొలి మరణం

**ముంబై:** గులియన్‌బారే సిండ్రోమ్ కారణంగా ఒక వ్యక్తి మరణించాడు. దీంతో ఈ వ్యాధికి సంబంధించి మహారాష్ట్రలో తొలి మరణం నమోదైంది. ఆ రాష్ట్రంలో గులియన్‌బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసుల సంఖ్య పెరుగడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. పూణేకు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ కొన్ని రోజులుగా విరేచనాలతో బాధపడుతున్నాడు. ఇటీవల అతడు సోలాపూర్ జిల్లాలోని తన సొంతూరుకు వెళ్ళాడు. నిరసంగా ఉండటంతో సోలాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాడు. కాగా, ఆ వ్యక్తికి వైద్య పరీక్షలు నిర్వహించగా గులియన్‌బారే సిండ్రోమ్ వ్యాధి బారినపడినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆ వ్యక్తికి ఐసీయూలో చికిత్స అందించారు. ఆరోగ్యం నిలకడగా ఉండటంతో శనివారం ఐసీయూ నుంచి వార్డులోకి తరలించారు. అయితే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడిన ఆ వ్యక్తి అదే రోజున మరణించినట్లు అతడి బంధువులు తెలిపారు. గులియన్ బారే సిండ్రోమ్ అనేది అరుదైన రోగ నిరోధక నరాల వ్యాధి. శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ నరాలపై దాడి చేస్తుంది. దీంతో ఆకస్మికంగా తిమ్మిరి, కండరాల బలహీనత ఏర్పడుతుంది. అతిసారం, కడుపు నొప్పి, జ్వరం, వికారం లేదా వాంతులు వంటి లక్షణాలుంటాయి. మరోవైపు పూణేలో 73 మందికి ఈ వ్యాధి సోకింది. వీరిలో 14 మంది వెంటిలేటర్లపై చికిత్స పొందుతున్నారు. శనివారం ఒక్కరోజే 9 మందికి ఈ వ్యాధి నిర్ధారణ అయ్యింది. అలాగే మహారాష్ట్రలో తొలి మరణం కూడా నమోదు కావడంతో పూణే అధికారులు అలెర్ట్ అయ్యారు.

# ట్రాక్టర్లతో రైతుల ర్యాలీ.. కనీస మద్దతు ధర కోసం డిమాండ్

**చండీగఢ్:** రిపబ్లిక్ డే సందర్భంగా రైతులు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. తమ పంటలకు కనీస మద్దతు ధరపై కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున కేంద్రానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ట్రాక్టర్లతో రైతులు నిరసన తెలపాలని సంయుక్త కిసాన్ మోర్చా జనవరి 8న పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఆదివారం పంజాబ్, హర్యానాతోపాటు పలు రాష్ట్రాల్లో రైతులు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కాగా, 2024 ఫిబ్రవరి 13 నుంచి పంజాబ్, హర్యానా సరిహద్దులోని ఖనౌరిలో రైతులు నిరసన కొనసాగిస్తున్నారు. పంటలకు కనీస మద్దతు ధరతోపాటు రుణ మాఫీ, రైతులు, కార్మికులకు పెన్షన్లు, 2021లో లఖింపూర్ ఖేరీ హింసా బాధితులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కేంద్రం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే 2020 నుంచి 2021 వరకు ఢిల్లీ సరిహద్దుల్లో చేపట్టిన నిరసనల కంటే పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సంయుక్త కిసాన్ మోర్చా తాజాగా హెచ్చరించింది.

## పద్మభూషణ్ బాలయ్యకు
# అభినందనల వెల్లువ

**సినీపరిశ్రమలో సందడేసందడి**

మెగాస్టార్, రాజమౌళి, మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్ సహా ప్రముఖుల అభినందనలు

**మహా:** పద్మభూషణ్ పురస్కారం పొందిన నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై ప్రశంసల వర్షం కురుస్తోంది. సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు చెబుతున్నారు. మెగాస్టార్ చిరంజీవి బాలకృష్ణ సహా పద్మ పురస్కారాలు వరించిన డా. డి నాగేశ్వరరెడ్డి, నటుడు అజిత్, రుద్రవీణ ఫేం శోభన, అనంత్ నాగ్, శేఖర్ కపూర్, సింగర్ అర్జిత్ సింగ్, మాడుగు నాగఫణి శర్మలకు చిరు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి నందమూరి బాలకృష్ణకు శుభాకాంక్షలు చెబుతు ట్వీట్ చేశారు. పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికైన బాలయ్యకు మనస్ఫూర్తిగా అభినందనలు. భారతీయ సినిమాలో మీ ప్రయాణం అభినందనీయం'' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

**అభినందనలు- - మహేశ్‌బాబు**

''పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికైన బాలకృష్ణకు హృదయపూర్వక అభినందనలు. ఈ అవార్డును అందుకోవడానికి మీరు పూర్తి అర్హులు'' మహేశ్‌బాబు

**బాల బాబాయికి అభినందనలు: జూ.ఎన్టీఆర్**

ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ అవార్డు అందుకున్న బాలయ్య బాబాయికి హృదయపూర్వక అభినందనలు. ఈ గుర్తింపు సినిమా రంగానికి మీరు చేసిన అసమానమైన సేవలకు మీ నిర్విరామ ప్రజా సేవకు నిదర్శనం అని ఎన్టీఆర్ ట్వీట్ చేశారు.

**బాబాయ్ కృషికి**
**సరైన గుర్తింపు: కల్యాణ్ రామ్**

ప్రతిష్టాత్మక పద్మ భూషణ్ అవార్డుకు ఎంపికైన బాబాయ్ నందమూరి బాలకృష్ణకి నా హృదయపూర్వక అభినందనలు. ఈ సన్మానం సినిమా ప్రపంచానికి మీరు చేసిన విశేషమైన సేవలకు సమాజానికి సేవ చేయడంలో మీ నిర్విరామ కృషికి నిజమైన గుర్తింపు కల్యాణ్ రామ్

## రూ.300 కోట్ల వైపుగా సంక్రాంతికి వస్తున్నాం

**కెరీర్‌లోనే వెంకీ మామకు బిగ్గెస్ట్ హిట్**



**మహా:** విక్టరీ వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో థియేటర్లలో సందడి చేస్తున్నారు. జనవరి 14న రిలీజైన ఈ సినిమా భారీ విజయం అందుకుంది. ఈ క్రమంలో బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. 12రోజుల్లోనే రికార్డు స్థాయిలో రూ.260 కోట్లు వసూల్ చేసింది. ఇక లాంగ్ రన్లో ఈ సినిమా ఈజీగా రూ.300 కోట్ల మార్క్ అందుకుంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దగ్గుబాటి వెంకటేశ్ కెరీర్లో ఈ సినిమా భారీ హిట్గా నిలిచింది. ఇప్పటికే ఆయన రూ.100 కోట్ల షేర్ లిస్ట్లో చేరారు. టాలీవుడ్ సీనియర్ హీరోల్లో ఈ ఘనత అందుకున్న రెండో హీరోగా నిలిచారు. వెంకీ కంటే ముందు మెగాస్టార్ చిరంజీవి రూ.100 కోట్ల షేర్ అందుకున్నారు. తాజాగా సినిమా భారీ స్థాయిలో వసూల్ చేయడంతో సీనియర్లలో రూ.250 కోట్ల మార్క్ దాటిన తొలి హీరోగానూ రికార్డు కొట్టారు.



## జిమ్ సెషన్‌లో బేబి హీరోయిన్ వైష్ణవి చైతన్య..
# వర్కవుట్స్‌తో బిజీబిజీ

బేబి సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది వైష్ణవి చైతన్య . ఈ భామకు నెట్టింట ఫ్యాన్ ఫాలోయింగ్‌తోపాటు ఫ్యాన్ బేస్ కూడా ఎక్కువేనని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రస్తుతం బొమ్మరిల్లు భాస్కర్ డైరెక్షన్‌లో డీజే టిల్లు హీరో సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటిస్తోన్న జాక్ ప్రాజెక్టులో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ బ్యూటీ ఇటీవలే వర్కవుట్ సెషన్‌లో పాల్గొన్నది. జిమ్‌లో ట్రైనర్ సమక్షంలో వర్కవుట్ చేస్తూ సైజ్ జీరో ఫిజిక్ కోసం చెమటలు చిందిస్తోంది. వైష్ణవి చైతన్య చిరునవ్వులు చిందిస్తూ సెల్ఫీ దిగింది. వైష్ణవి చైతన్య జిమ్ వేర్‌లో అందాలు ఆరబోస్తూ నెటిజన్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. జిమ్ సెషన్ స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే మేకర్స్ జాక్ నుంచి వైష్ణవి చైతన్య బ్లాక్ అవుట్‌ఫిట్‌లో కనిపిస్తున్న లుక్‌ను షేర్ చేశారని తెలిసిందే.ఈ మూవీలో వైష్ణవి చైతన్య ముస్లిం యువతిగా కనిపించనున్నట్టు మేకర్స్. జాక్ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. గతేడాది చివరగా లవ్ మీ సినిమాలో మెరిసిన ఈ భామ ప్రస్తుతం మరో తెలుగు సినిమాను కూడా లైన్‌లో పెట్టింది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలపై క్లారిటీ రావాల్సి ఉంది.

## దేవాలో షాహిద్‌కపూర్ పూజాహెగ్డే సీన్‌పై
# సెన్సార్ అభ్యంతరం..



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ పూజా హెగ్డే. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో స్టార్ హీరోలతో కలిసి నటిస్తూ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగిన ఈ భామ 2024ను మాత్రం జీరో ఇయర్‌గా ముగించేసింది. చాలా కాలంగా సరైన హిట్ కోసం చూస్తున్న ఈ బ్యూటీ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టింది. వీటిలో ఒకటి హిందీ సినిమా దేవా. బాలీవుడ్ యాక్టర్ షాహిద్ కపూర్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. బిగ్ బీ అమితాబ్ బచ్చన్ దేవా సినిమా స్ఫూర్తితో వస్తోన్న ఈ మూవీకి మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రూస్ దర్శకత్వం వహిస్తున్నాడు. పూజాహెగ్డే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.ఈ చిత్రం జనవరి 31న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీకి సెన్సార్ బోర్డు క్లీన్ యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. అయితే ఇందులో షాహిద్ కపూర్‌పూజాహెగ్డే సన్నిహిత సన్నివేశంపై సెన్సార్ బోర్డు అభ్యంతరం తెలిపినట్టు బీటౌన్ సర్కిల్ టాక్. తాజా టాక్ ప్రకారం సెన్సార్ బోర్డు ఈ సీన్ నుంచి 6 సెకన్లు ట్రిమ్ చేయాలని సూచించిందట. దేవాతో గ్రాండ్ కమ్ బ్యాక్ ఇవ్వాలనుకుంటున్న పూజాహెగ్డేకు మరి ఈ సినిమా ఎలా కలిసి వస్తుందో చూడాలంటున్నారు సినీ జనాలు. రాయ్ కపూర్ ఫిలిమ్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో పావేల్ గులాటి, ప్రవేశ్ రాణా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. షాహిద్ కపూర్ ఈ చిత్రంలో రూత్‌లెస్ పోలీస్‌గా అలరించబోతున్నట్లు ఇటీవలే విడుదల చేసిన ట్రైలర్ ద్వారా హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్.



# ఆస్ట్రేలియన్ ఓపెన్ విన్నర్ మళ్లీ సిన్నరే..
## ఫైనల్లో చిత్తుగా ఓడిన అలెగ్జాండర్

ఆస్ట్రేలియన్ ఓపెన్ మెన్స్ సింగిల్స్ టైటిల్ ను మళ్లీ వరల్డ్ నెంబర్ 1 ఆటగాడు జెన్నిక్ సిన్నరే దక్కించుకున్నాడు. ఆదివారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ – 2025 మెన్స్ సింగిల్స్ ఫైనల్‌లో ఇటలీ టెన్నిస్ దిగ్గజం సిన్నర్ జర్మనీ ఆటగాడు అలెగ్జాండర్ జ్వరెవ్ ను చిత్తుగా ఓడించాడు. జ్వరెవ్ 6-3, 7-6 (7-4), 6-3 తేడాతో ఓటమి పాలయ్యాడు. ఈ ఇద్దరి మధ్య ఫైనల్ పోరు 2.42 గంటలపాటు ఆసక్తికరంగా సాగింది. టోర్నీ ప్రారంభం నుంచి జోరు కనబర్చిన సిన్నర్.. ఫైనల్లోనూ అదే జోరు కొనసాగించాడు. రెండో సెట్‌లో మినహా సిన్నర్‌కు ఏ దశలోనూ జ్వరెవ్ సరైన పోటీ ఇవ్వలేకపోయాడు. దాంతో సిన్నర్ మూడు సెట్లలోనే మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. సిన్నర్‌కు ఇది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్. గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోపాటు యూఎస్ ఓపెన్ టైటిల్‌ను కూడా సిన్నర్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఈసారి కూడా ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ దక్కడంతో మొత్తం టైటిళ్ల సంఖ్య 3కు చేరింది. ఇదిలావుంటే ఈసారైనా ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గి తొలి గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకోవాలని భావించిన జ్వరెవ్ ఆశలు ఆశలుగానే మిగిలిపోయాయి. 2020లో యూఎస్ ఓపెన్‌లో, గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో కూడా సిన్నర్ ఫైనల్‌కు చేరాడు. కానీ, టైటిల్ నెగ్గడంలో విఫలమయ్యాడు. మొత్తం మూడు సార్లు ఫైనల్లోకి అడుగుపెట్టినా గ్రాండ్ స్లామ్ టైటిల్ కల మాత్రం జ్వరెవ్‌కు అందని ద్రాక్షగానే మిగిలింది.



# ఐసీసీ ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ..

**ఇయాన్ చాపెల్ వ్యాఖ్యలు..!**




అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ICC)ను ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ అభివర్ణించారు. ఆర్థికంగా బలంగా ఉన్న బోర్డులే తమ సొంత కార్యక్రమాలను సిద్ధం చేసుకుంటున్నాయని.. ఇది టెస్ట్ క్రికెట్ ప్రయోజనాలకు హాని కలిగిస్తుందని ఆరోపించారు. టెస్ట్ క్రికెట్ కోసం టైర్ టూ సిస్టమ్‌ను ఇప్పటికే అమలు చేయాల్సిందన్నారు. ఈఎస్‌పీఎన్‌కు కాలమ్స్ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందులో సంక్లిష్టమైన సమస్య ఉందని.. ఐసీసీ క్రికెట్‌ను నడపలేదని.. మనసు మారకపోతే ఆర్థికంగా బలమైన దేశాలు సెల్ఫ్‌సర్వీస్ షెడ్యూల్‌ను రూపొందించడంలో ప్రముఖ పాత్రను కలిగి ఉంటాయన్నారు. అయితే, క్రికెట్‌లో భారత ప్రభావం, సహకారం అసమానంగా ఉందని చాపెల్ పేర్కొన్నారు. ప్రధాన సమస్య ఆర్థిక విభజేనని.. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ ధనిక దేశాలని.. క్రికెట్ సంస్థలకు పంచిన డబ్బులో ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయన్నారు. టెస్ట్ క్రికెట్‌ను రెండు విభాగాలుగా విభజించి.. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి పెద్ద జట్లు ఎక్కువ ప్రాధాన్యమున్న మ్యాచులు ఆడేలా చేయాలనే ప్రతిపాదన జరుగుతుందని.. ఏదేమైనా ఈ వ్యవస్థ చిన్న జట్లకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయన్నారు. ఫలితంగా చిన్న జట్లకు టెస్టులు తక్కువగా ఆడే అవకాశం ఉందని.. ఇది ఆటకు ప్రమాదం కలిగిస్తుందన్నారు. అలాగే, పలు ప్రమాణాలతో పదోన్నతి, బహిష్కరణ వ్యవస్థలు సైతం అమలు చేయాలన్నారు. వాస్తవానికి పరిమిత సంఖ్యలోనే జట్లు ఐదు రోజుల పాటు పోటీపడే సామర్థ్యం కలిగి ఉన్నాయన్నారు. అఫ్గానిస్తాన్, ఐర్లాండ్ అన్ని అవసరాలను తీర్చనందున టెస్ట్ క్రికెట్‌ను నిర్వహించకూడదని చాపెల్ అన్నారు. ప్రమోషన్, బహిష్కరణతో కూడిన వ్యవస్థ సాధ్యమే, కానీ జట్టు టెస్ట్ హోదా పొందాలంటే కొన్ని ప్రమాణాలు అవసరమన్నారు. ఆయా జట్లకు ఫస్ట్ క్లాస్ టోర్నమెంట్స్ ఉన్నాయా? ఐదు రోజుల మ్యాచులను నిర్వహించేందుకు మైదానాలు ఉన్నాయా? సరైన సౌకర్యాలు ఉన్నాయా? ఆర్థికంగా స్థిరంగా ఉన్నాయా? చూడాలన్నారు. ఒక జట్టు అన్ని ప్రమాణాలు ఉంటే ఉన్నత స్థాయి ఆటను కొనసాగిస్తే టెస్ట్ క్రికెట్ హోదా మంజూరు చేయడం చట్టబద్ధమైందన్నారు. ఇటీవల చాలా దేశాలు ఏ సహేతుకమైన ప్రమాణాలను చేరుకోలేవన్నారు. సమస్యాత్మకమైన ఆఫ్ఘనిస్తాన్ తమ దేశంలో టెస్ట్‌లను నిర్వహించగలదా? ఆ దేశానికి టెస్ట్ హోదా ఎందుకు అని ప్రశ్నించారు. ఐర్లాండ్‌లో టెస్టులు నిర్వహించేందుకు మైదానాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. చిన్న క్రికెట్ ఆడే దేశాలు స్వదేశంలో ఫస్ట్ క్లాస్ మ్యాచులు నిర్వహించడం అంత సులభమైన విషయం కాదన్నారు. దీనికి ఎంతో ఖర్చు అవుతుందన్నారు. టీ20 క్యాలెండర్ ప్రస్తుత షెడ్యూల్‌లో ఆటను ప్రభావితం చేస్తుందన్నారు. ఎంసీజీలో భారత్‌తో సామ్ కాన్‌స్టాస్ టెస్టు అరంగేట్రాన్ని ఉదాహరణ అని పేర్కొన్నారు. టెస్ట్ చూడడానికి వచ్చే అభిమానులు మరిన్ని టీ20 స్టయిల్ షాట్స్ చూడాలని ఆశించే స్థాయికి చేరుకుంటుందన్నారు. ఎంసీజీలో కాన్‌స్టాస్ ఇన్నింగ్స్‌కు వచ్చిన ప్రతిచర్యలు ఇది ఇప్పటికే జరుగుతున్నట్లుగా చూపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## కెప్టెన్ అక్షయ్ అద్భుత బ్యాటింగ్.. హర్ష్ స్పిన్ మాయాజలం..!
# రాజస్థాన్‌పై విదర్భ సంచలన విజయం..!



రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌బీ మ్యాచ్‌లో రాజస్థాన్‌పై విదర్భ సంచలన విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ అద్భుత సెంచరీ, స్పిన్నర్ హర్ష్‌దూబే బెస్ట్ బౌలింగ్‌తో 221 పరుగుల తేడాతో గెలుపొందింది. కెప్టెన్ వాడ్కర్ (139), యష్ రాథోడ్ (98), ఆల్ రౌండర్ నచికేత్ భూటే (87) రెండో ఇన్నింగ్స్‌లో కీలక పాత్ర పోషించారు. విదర్భ తొమ్మిది వికెట్లకు 428 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఎడమచేతి వాటం స్పిన్నర్ దూబే 19 ఓవర్లు వేసి 51 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 10 వికెట్లు తీశాడు.

ఈ విజయంతో విదర్భ ఆరు పాయింట్లు సాధించి.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఇక ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 165 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 265 పరుగులు చేసింది. దాంతో విదర్భ వంద పరుగుల వెనుకంజలో నిలిచింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో క్లిష్ట పరిస్థితిలో కెప్టెన్ అక్షయ్ వాడ్కర్.. రాథోడ్‌తో కలిసి 94 పరుగుల కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. రాథోడ్ తృటిలో సెంచరీ సాధించే అవకాశం కోల్పోయాడు. వాడ్కర్, భూటేల 172 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయడంతో విదర్భ మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఉదయం 7 వికెట్లకు 358 పరుగుల స్కోర్ చేసిన విదర్భ.. నాలుగో రోజు మరో 70 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. రాజస్థాన్ 329 పరుగుల విజయ లక్ష్యం నిర్దేశించింది.

అక్షయ్ వాడ్కర్ 269 బంతులు ఎదుర్కొని 14 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయ సెంచరీ చేశాడు. నచికేత్ బూటీ ఆరు ఫోర్లు, మూడు సిక్సర్ల సహాయంతో 87 పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన 22 ఏళ్ల దూబే.. రెండో ఇన్నింగ్స్‌లో మరో ఐదు వికెట్లు పడగొట్టాడు. ఆఫ్ స్పిన్నర్ అక్షయ్ వఖరే మూడు వికెట్లు పడగొట్టాడు. వీరిద్దరు కలిసి రాజస్థాన్ బ్యాటింగ్ లైనప్‌ను కూల్చడంతో రాజస్థాన్ 43.3 ఓవర్లలో ఆలౌట్ అయ్యింది. గ్రూప్‌బీలోని ఇతర మ్యాచ్‌లలో ఆంధ్రపుదుచ్చేరి మ్యాచ్ డ్రాగా ముగియగా.. హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ 43 పరుగుల తేడాతో హిమాచల్‌ప్రదేశ్‌ను ఓడించింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ




**ఆదిలాబాద్ మహా :** మహాత్మా గాంధీ అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టి నేటికి సరిగ్గా శత వసంతాలు పూర్తయిందన్నారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి . ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ , మల్లి ఖార్జున ఖర్గే ఇతర కాంగ్రెస్ పెద్దల ఆదేశాల మేరకు జైబాపు ,జై భీం , జై సంవిధాన్ నినాదంతో భారత రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ చేపట్టామన్నారు.ఇది దేశం పట్ల ,మహనీయుల పట్ల , భారత రాజ్యాంగం పట్ల కాంగ్రెస్ పార్టీకున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు.జైబాపు .జైభీం దేశానికి ఆదర్శమన్నారు.ఆ మహనీయుల ఆశయాల మేరకు తప్పకుండా భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటామని అన్నారు.కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రిజర్వేషన్లు ఎత్తేసి డాక్టర్ బాబాసాహెబ్ అండేద్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లుపొడిచే ప్రయత్నంలో ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తప్పకుండా దానిని అడ్డుకుని తీరుతుందన్నారు.పేద బడగు బలహీన వర్గాల మేలుకోరి తయారుచేసిన రాజ్యాంగాన్ని మారుస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేద బడగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటు పడే పార్టీ అని గుర్తు చేసారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపల్లి నగేష్,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్, లోక ప్రవీణ్ రెడ్డి, కౌన్సిలర్లు యెల్మెల్వార్ రామ్ కుమార్,బండారి సతీష్,కలాల శ్రీనివాస్, దర్శనాల లక్ష్మణ్,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు, తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మకంటి రమేష్,సుధాకర్ గౌడ్,పత్తి ముజ్జు ,బూర్ల శంకరయ్య,నుస్రత్ ఖాన్,కిజర్ పాషా,పోరెడ్డి కిషన్,మోర ఆశన్న, కొండూరి రవి,తుమ్మల ప్రకాష్, మన్సూర్,సుకెందర్, అతిక్ ఉర్ రహమాన్,సయ్యద్ సుజాత్ అలీ,ఖలీల్ మహిళా నాయకురాలు దేశెట్టి ప్రభావతి,ప్రేమల,గంగమణి, రామ, ఉమ మహేశ్వరి,మందాకిని,అఫ్రోజ భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి

## పలు చోట్ల జాతీయ పతాకావిష్కరణ



**ఆదిలాబాద్ మహా :** తరతరాల బానిసత్వానికి శాశ్వత విముక్తి కలిగి భారతావని గణతంత్రంగా అవతరించిన నేటి శుభ దినోత్సవం రోజున నాటి త్యాగధనులను సేవలను స్మరించుకోవాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని తన క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ ఆవరణలో పెద్ద సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ శ్రేణుల తో కలిసి మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాలపన చేసారు.మహాత్మా గాంధీ అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టి నేటికి సరిగ్గా శత వసంతాలు పూర్తయిందన్నారు.అలాంటి పార్టీకి ఎంతో చరిత్ర ఉందన్నారు.జైబాపు ,జై భీం , జై సంవిధాన్ అని నినదించారు.ప్రజలందరికి 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేసారు. అనంతరం సుందరయ్య నగర్, లారీ అసోషియేషన్ ,ఐఎన్ టీయూసీ కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకలు హాజరై జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపల్లి నగేష్,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్, లోక ప్రవీణ్ రెడ్డి, కౌన్సిలర్లు యెల్మెల్వార్ రామ్ కుమార్,బండారి సతీష్,కలాల శ్రీనివాస్, దర్శనాల లక్ష్మణ్,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు, తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మకంటి రమేష్,సుధాకర్ గౌడ్,పత్తి ముజ్జు,బూర్ల శంకరయ్య,నుస్రత్ ఖాన్,కిజర్ పాషా,పోరెడ్డి కిషన్,మోర ఆశన్న, కొండూరి రవి,తుమ్మల ప్రకాష్, మన్సూర్,సుకెందర్, అతిక్ ఉర్ రహమాన్,సయ్యద్ సుజాత్ అలీ,ఖలీల్ మహిళా నాయకురాలు దేశెట్టి ప్రభావతి,ప్రేమల,గంగమణి, రామ, ఉమ మహేశ్వరి ,మందాకిని,అఫ్రోజ భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**ములుగు, మహా :** 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, రాజకీయ పార్టీలు, యూనియన్ల కార్యాలయాల వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఘణంగా వేడుకలను నిర్వహించారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి సీతక్క, కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శబరీష్, గ్రంథాలయ శాఖ కార్యాలయంలో చైర్మన్ రవిచందర్ , జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో డిఎంఅండ్ హెచ్ఓ గోపాల్ రావులతోపాటు పలు శాఖల్లో ఆయా శాఖల ఉన్నతాధికారులు పతాకావిష్కరణ చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో పతాకావిష్కరణ అనంతరం విద్యార్థులు జిల్లా పురవీధుల్లో స్వాతంత్ర సమర యోధులు, భరతమాత, ప్రత్యేక వేశాదారణలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులపై విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురుని ఆకట్టుకున్నాయి.

## క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి, జిల్లా కలెక్టర్



**వరంగల్, మహా:** ఖమ్మం,వరంగల్ మామునూరు హైవే పై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎంజిఎంలో చికిత్స పొందుతున్న క్షతగ్రాతులను మంత్రి కొండా సురేఖ పరామర్శించారు. ఎంజిఎంలోని వేర్వేరు వార్డుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్ళి వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. వారి కుటుంబ సభ్యులను మంత్రి ఓదార్చారు. వారు తిరిగి పూర్తిగా కోలుకునేంత వరకు ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని మంత్రి వారికి భరోసా ఇచ్చారు. తక్షణావసరాల కోసం వారికి కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను మంత్రి సురేఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో భారీ వాహనం నడుపుతుండటంతో అది అదుపు తప్పి ఆటోలో వెళ్తున్న వారి పై పడటంతో ప్రమాదం జరిగినట్లుగా అధికారులు మంత్రికి తెలిపారు. ఈ దుర్ఘటనలో నలుగురు ప్రమాదస్థలంలోనే మరణించగా, ఇద్దరు గాయాలతో ఎంజిఎం లో చేరినట్లుగా వివరించారు. మృతుల కుటుంబాలను మంత్రి సురేఖ ఓదార్చారు. వారికి ప్రభుత్వం పరంగా అన్ని విధాల సహాయ, సహకారాలను అందిస్తామని మంత్రి అభయమిచ్చారు. చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం పరంగా దక్కాల్సిన ప్రయోజనాలను అందించి, వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని మంత్రి సురేఖ సూచించారు. మంత్రి వెంట వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్య శారద పలు శాఖలకు చెందిన అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వరంగల్ లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

- అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ను అందజేసిన మంత్రి కొండా సురేఖ
- పాల్గొన్న మేయర్ జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే



**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలుఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లా ఓసిటీలోని క్యాంప్ ఆఫీస్ లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి కొండా సురేఖ జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26దేశ ప్రజలందరికీ అత్యంత శుభదినమని అన్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడంలో ప్రధాన భూమిక రాజ్యాంగానిదేనని మంత్రి సురేఖ అన్నారు. భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిలపడంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే సర్వోత్కృష్టమైన రాజ్యాంగాన్ని అందించిన రాజ్యాంగ నిర్మాతల ఆశయాల సాధనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని మంత్రి సురేఖ తెలిపారు. ఈ శుభదినాన్ని పురస్కరించుకుని రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ప్రారంభించుకోవడం అత్యంత సంతోషాన్నిచ్చిందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రజా పాలనలో భాగంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం వెంకటరావు పల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రేషన్ కార్డులో జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ను అందజేసారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్య శారద, స్థానిక కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ల లో ఘనంగా గణతంత్ర దినోత్సవ సంబరాలు

పాల్గొన్న కార్పొరేటర్లు, స్థానిక నాయకులు



వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 12, 22, 23,27, 28,34, పలు డివిజన్ల పరిధిలో గణతంత్ర దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. శివనగర్ లోని శివ సాయి నగర్ మెట్ల బావి వద్ద ఆదివారం ధన మైసమ్మ అమ్మవారి ఆలయ ప్రెసిడెంట్ తోట బాబు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా 34 డివిజన్ పెద్దల తోటి కలిసి జెండా ఆవిష్కరించిన అనంతరం స్థానికులకు, పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దొడ్డి కుమారస్వామి, బస్వరాజు కుమారస్వామి, గందె కల్పన నవీన్, చింతాకుల అనిల్ కుమార్, కావటి కవిత, సీనియర్ నాయకులు చింతాకుల సునీల్ కుమార్, డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్, యెలుగం రాకేష్, దామర సర్వేశం, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## బల్దియాలో ఘనంగా గణతంత్ర వేడుకలు

- మేయర్ తో కలిసి జాతీయ జెండా ఎగురవేసిన కమిషనర్
- ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాల అందజేత



**వరంగల్, మహా:** 76 వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని జీడబ్ల్యుఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణితో కలసి డాక్టర్అ శ్విని తానాజీ వాఖడే జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు.ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి మేయర్ తో కలసి కమిషనర్ ప్రశంసా పత్రాల అందజేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన కార్పొరేటర్లు, బల్దియా ఉద్యోగులకు వారు బహుమతుల ప్రధానం చేశారు. డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్ షమీం కార్పొరేటర్లు దేవరకొండ విజయ లక్ష్మి పల్లం పద్మ ముష్కమల్ల అరుణ గుండు చందన రమా తేజస్వి అరుణ కుమారి బసవరాజు శిరీష ఇమ్మడి లోహిత మరుపల్ల రవి, దిడ్డి కుమారస్వామి నల్లా స్వరూప రాణి చింతాకుల అనిల్ కుమార్ జన్ను శిభారాణి అరుణ విక్టర్ బల్దియా కు చెందిన వివిధ విభాగాల ఉన్నతాధికా రులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో కమీషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే మాట్లాడుతూ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు విచ్చేసిన నగర ప్రజలకు, స్వాతంత్ర్య సమర యోధులకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ఉద్యోగులకు, పాత్రికేయులకు ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే, సమగ్ర కుటుంబ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల సర్వే, ప్రతిష్టాత్మకంగా నేటి నుండి అమలు చేస్తున్న నాలుగు పథకాల సర్వేను మేయర్ గుండు సుధారాణి, ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్ల సహకారంతో విజయంతం చేసిన అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా కమిషనర్ అభినందించారు.

# ములుగులో ఘనంగా త్రివర్ణోత్సవం

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ వాకర టి.ఎస్
- గౌరవవందనం సమర్పించిన పోలీసులు
- జిల్లా పురోగతి వివరాలు వెల్లడించిన కలెక్టర్
- ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు అందించిన మంత్రి సీతక్క





**ములుగు, మహా :** భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా కేంద్రంలోని తంగేడు మైదానం లో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ముఖ్య అతిథిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రజలకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు కలెక్టర్ 76వ గణతంత్రదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన పురోగతి వివరాలను వెల్లడించారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా జిల్లా వ్యాప్తంగా 6123 మందికి వైద్య సేవలు, 3947 మంది గర్భిణీలు నమోదుకాగా 3,013 మందికి ప్రసవాలు చేసినట్లు తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో ఓపి, ఐపి సేవలు రెండింతలుగా పెరిగాయని, రోజువారిగా ఓపి 650, ఐపి 150గా నమోదవుతున్నాయని తెలిపారు. ఆస్పత్రిలో 14 విభాగాల డాక్టర్లతో పాటు, వైద్య పరీక్షలు నిరంతరంగా చేపడుతున్నామని, దీంతో ఎంజిఎంకు రెఫర్ చేసే రోగుల సంఖ్య ఘననీయంగా తగ్గిందన్నారు. జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభించుకొని 60 సీట్లకు గాను 56 మంది అడ్మిషన్ పొందారని, 50 మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించామని, ఆరుగురు ప్రొఫెసర్లతో డిసెంబర్ 1 నుండి ఆన్ లైన్ లో తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 80 లక్షల 57మంది మహిళలు ఉచితంగా ప్రయాణించగా వారికి 36కోట్ల 48లక్షల 54వేలకు పైగా రూపాయలను మహిళలకు ఆదా చేయడం జరిగిందన్నారు. ఏటూరునాగారంలో 6.28 కోట్లతో నూతన బస్ డిపో, ములుగులో 5.11 కోట్ల నిధులతో మాడల్ బస్టాండ్, మంగపేటలో 52 లక్షలతో బస్టాండ్ నిర్మాణానికి చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా 26811 మంది రైతులకు 219కోట్ల97లక్షల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా ఖరీఫ పంటలకు 204 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,33,681 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 19,133 మంది రైతులకు 273 కోట్ల 2 లక్షల రూపాయలు, సన్న ధాన్యానికి 3 కోట్ల 55 లక్షలు సబ్సిడీని లబ్దిదారులకు అందజేశామన్నారు. విద్యుత్ శాఖ ద్వారా జిల్లాలో 39700 మంది వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను అందజేస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా 15లక్షల 82వేల పనిదినాలు కల్పించి 64,976 మంది కూలీలకు 36కోట్లకు పైగా చెల్లించామన్నారు. పంచాయతీ శాఖ ద్వరా జిల్లాలోని 174 గ్రామపంచాయతీలలో ట్రాక్టర్ల ద్వారా ప్రతీ ఇంటి నుండి చెత్తను డంప్ యార్డులకు తరలిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నామన్నారు. మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 640 అంగన్ వాడీకేంద్రాలకు ఉచితంగా స్కూల్ కిట్స్, బాల సదనం కోసం కోటి 30 లక్షల రూపాయలను మంజూరు చేశామని, వెంకటాపురం మండలం పాలంపేటలో 90 లక్షలతో ప్రభుత్వ వృద్ధాశ్రమ భవన నిర్మాణ పనులు మొదలు పెట్టినట్లు తెలిపారు. జిల్లాలో తొలివిడుతలో 60 అంగన్ వాడీ కేంద్రాలను కార్పోరేట్ స్కూల్లకు ధీటుగా తీర్చిదిద్దామని, వికలాంగులకు గతంలో 7 రకాల వైకల్యాలను మాత్రమే సదరం క్యాంపులో గుర్తించే వారని, ఇప్పుడు 21రకాల వైకల్యాలను గుర్తించి సర్టిఫికేట్లు పొందే ప్రక్రియను సులభతరం చేశామన్నారు. ట్రాన్స్ జెండర్లకు ప్రత్యేకంగా మైత్రి క్లినిక్ న ప్రారంభించామన్నారు. దివ్యాంగులైన 466 మందికి 63 లక్షలతో 857 సహాయ ఉపకరణాలు అందించామన్నారు. అంగన్ వాడీలకు క్యాంపులు నిర్వహించి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించామన్నారు. జిల్లా కేంద్రంలోని బండారుపల్లిలో వర్కింగ్ ఉమన్స్ హాస్టల్ నిర్మాణంకోసం 20 గుంటల భూమిని కేటాయించి రూ 5.50 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 6 ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లోని 411 మంది విద్యార్థులకు 66వేల ఖర్చు, బెస్ట్ అవలబుల్ స్కూల్ స్కీంలో భాగంగా 119 మంది విద్యార్థులకు 25 లక్షల నిధులు వెచ్చించి ఉచిత బోధన వసతి కల్పిస్తున్నామన్నారు. గిరిజనాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12 నుండి 15 వరకు జరుగనున్న మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు 10 శాఖలతో రూ. 533కోట్ల 45 లక్షల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా పనులు జరుగుతున్నాయన్నారు. ఎన్ ఐటి, ఐఐటిలో సీట్లు వచ్చిన 39 మంది విద్యార్థులకు రూ.14లక్షల79వేల ఆర్థిక సాయం, 27 మందికి రూ. 12 లక్షల విలువచేసే ల్యాప్ టాప్ లు అందజేశామన్నారు.

వెనుకబడిన తరగతి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వసతి గృహాల్లో 413 మంది విద్యార్థులకుగాను 14లక్షల15 వేల రూపాయల ఖర్చు చేశామని, 1252 మంది విద్యార్థులకు పోస్టు మెట్రిక్ ఫీజు రీయంబర్స్ మెంట్ కోసం 83లక్షల 44వేల రూపాయలు ఖర్చు చేసినట్లు, కల్లు గీత కార్మికులకు 200 మందికి కాటమయ్య సేఫ్టీ మోకులు అందజేశామన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 84 మంది విద్యార్థులకు పోస్టు మెట్రిక్ ఉపకార వేతనం కింద 5లక్షల93 వేలు మంజూరు చేశామన్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో 2024 25 సంవత్సరంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలలో భాగంగా 975 మంది లబ్దిదారులకు 9కోట్ల 76 లక్షలు అందజేశామన్నారు. పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో ఈజీఎస్ పథకం ద్వారా 81 కోట్ల 23 లక్షల వ్యయంతో 86 సీసీ రోడ్లు, 15 గ్రామ పంచాయతీ భవనాలు, 18 అంగన్ వాడీ కేంద్రాలు, 12 స్కూల్ టాయిలెట్స్ నిర్మించామన్నారు. ఆర్ అండ్ బి శాఖ ద్వారా 484 కోట్ల నిధులతో 73 పనులు చేపట్టామని, అందులో 45 పనులు పూర్తికాగా 28 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. జిల్లా సమీకృత కార్యాలయముల సముదాయ భవనం, రెసిడెన్సిషయల్ క్వార్టర్స్ నిమిత్తం 63కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేయగా శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతు న్నాయన్నారు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో 53వేల 278 ఎకరాల ఆయకట్టుకు సాగనీరు అందించామని, మిషన్ భగీరథ ఆధ్వర్యంలో 1021.68 కిలోమీటర్ల పైపు లైన్ వేసి 490 ఆవాసాలకు తాగునీరు అందించా మన్నారు. ఇంట్రా సరఫరా నిమిత్తం 1238.63 కిలోమీటర్ల పైపు లైన్, నూతనంగా 379 ఓవర్ హెడ్ ట్యాంక్లు నిర్మించామని, మొత్తం 601 ట్యాంక్ లతో 89,934 గృహాలకు నీటి అందేస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో 2004 డీఎస్సీ ద్వారా 174 మంది నూతన ఉపాధ్యాయులను నియమించినట్లు, జిల్లాలోని 554 పాఠశాలలకు గాను 239 పాఠశాలల్లో అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీ ద్వారా 6 కోట్ల 91 లక్షల రూపాయలను మౌళిక వసతులకొరకు ఖర్చుచేశామన్నారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా 405 పాఠశాలల్లో 14740 మంది విద్యార్థులకు సమతుల పౌష్ఠికాహారాన్ని అందిస్తున్నామన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా 174 గ్రామ పంచాయతీలలో 12 లక్షల 94వేల మొక్కలు నాటామని, వివిధ శాఖలలోని నర్సరీలలో 25 లక్షల 40 వేల మొక్కలు పెంచామని, అటవీ పర్యాటక ప్రాంతాలైన బ్లాక్ బెర్రీ అరణ్య క్యాంప్, లక్నవరం జంగిల్ క్యాంప్, ట్రెక్కింగ్ మార్గాలు, బొగత జలపాతం, రాక్షసగుహలు, దామెరవాయి గుండేటి వ్యూపాయింట్, లక్నవరం పార్కునందు జంగిల్ సఫరా వాహనాలు, ఇంజర్ల అర్బన్ పార్కులు అభివృద్ధి చేశామన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో రాయితీపై 493 చెరువుల్లో 73 లక్షల 9వేల చేప పిల్లలను విడుదల, చనిపోయిన ముగ్గురు మత్స్య కారులకు రూ. 5 లక్షల చొప్పున అందజేసినట్లు తెలిపారు. టిజి ఐపాస్ కింద 11 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు, 19 వివిధ రకాల పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోగా 2.98 కోట్ల రూపాయల పెట్టుబడితో 49 మందికి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 1.47 కోట్ల రూపాయల రాయితీని మంజూరు చేశామన్నారు. ధరణి ద్వారా 12.0818 దరఖాస్తులు రాగా 11.701 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. త్వరలో కొత్త చట్టం అమలులోకి రానున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 16 నుండి 20 తేదీ వరకు రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోస, ఇందిరమ్మ ఇండ్లకు క్షేత్రస్థాయి విచారణ నిర్వహించామని, 21 నుండి 24 తేదీ వరకు నిర్వహించిన గ్రామ సభల్లో లబ్దిదారులు ప్రకటించినట్లు తెలిపారు.

## జిల్లా కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు




**ఇబ్రహీంపట్నం, జనవరి 26 మహా:** జిల్లా సమీకృత కార్యాలయంలో 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి. ఆదివారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి ప్రసంగించారు.

**స్వాతంత్ర్య సమర యోధులు ఎమ్. రాంరెడ్డిని కలెక్టర్ సత్కారం చేశారు**

గ్రామీణాభివృద్ధి,విద్యాశాఖ,రవాణా,వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించి నశకటాల ప్రదర్శన నిర్వహించడం జరిగినది. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ మహేశ్వరం, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్



ఇబ్రహీంపట్నం, కేజీవీబీ మహాత్మాగాంధీ జ్యోతిబా పులే స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నాదర్ గుల్, జిల్లా పరిషత్ హై స్కూల్ తుక్కుగూడ, తెలంగాణ మైనార్టీ హై స్కూల్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఎద నిండా దేశభక్తి భావాన్ని నింపుకుని తమ ప్రదర్శనలతో గణతంత్ర దినోత్సవ వేడుకలకు వన్నెలద్దారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, మహేశ్వరం డి.సి. పి సునీత రెడ్డి, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**అర్హులకు అన్యాయం జరగకుండా పథకాలు వర్తింపజేస్తాం**

**నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క**





**ములుగు, మహా:** పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఆదివారం జిల్లాలోని ములుగు మండలం జీవంత రావు పల్లి, వెంకటాపూర్ మండలం లింగాపూర్, గోవిందరావుపేట మండలం రాఘవపట్నం, తాడ్వాయి మండలం అంకంపల్లి, ఏటూనాగారం మండలం ముల్లకట్ట, కన్నాయిగూడెం మండలం కంతనపల్లి, మంగపేట మండలం పూరేడిపల్లి, వెంకటాపురం మండలం రాచపల్లి, వాజేడు మండలం టేకులగూడెం గ్రామాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పథకాలను లాంఛనంగా ప్రారంభించారు. ములుగు మండలం జీవంతరావుపల్లి, వెంకటాపూర్ మండలం లింగాపూర్, గోవిందరావుపేట మండలం రాఘవపట్నం గ్రామాలలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో లాంఛనంగా ప్రారంభించారు. ఆయా పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు మంజూరీ పత్రాలు అందజేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సందేశంతో కూడిన వీడియో క్లిప్ ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే పలు పథకాలను రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్నామని, గతంలో కాకుండా నేడు గ్రామాలలో నిజమైన లబ్ధిదారులను గుర్తించడానికి ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమక్షంలోనే అర్హుల జాబితాను ప్రకటించామన్నారు. ప్రభుత్వ పథకాలు అందని అర్హులు ఆందోళన చెందవద్దని, అర్హులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందని పక్షంలో అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చని, నిరంతరంగా ఈ ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. ప్రస్తుతం ప్రతి మండలంలో ఒక ఆదర్శ గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందని, విడతల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేసి పథకాలను అందజేస్తామని స్పష్టం చేశారు. గ్రామాలలోని ప్రజలు సహకరిస్తేనే లబ్ధిదారుల ఎంపిక పూర్తి అవుతుందని, కొందరు రాజకీయ పార్టీల నాయకులు కావాలనే గొడవలు సృష్టిస్తున్నారని వారి మాటలను ప్రజలు నమ్మవద్దని తెలిపారు. 10 సంవత్సరాల గత ప్రభుత్వ హయాంలో ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కొమురయ్య , డిసిఎస్ఓ షా ఫైజల్ హుస్సేని, తహసిల్దార్ విజయ భాస్కర్, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## మహమ్మద్ సల్మాన్ కు

**శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే**

**ఇబ్రహీంపట్నం, జనవరి 26 మహా:** పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే వెన్నంటే ఉంటూ ఆయన విజయాలకు దోహదపడుతూ, సహచరులతో కలిసి అలుపెరుగని పోరాటం చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మహమ్మద్ సల్మాన్. ఆదివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేసి, ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, తాళ మహేష్ గౌడ్ శ్రీకాంత్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంస పత్రాలు స్వీకరించిన బల్దియా అధికారులు

**హన్మకొండ వరంగల్ జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా స్వీకరణ**




**వరంగల్, మహా:** 26 జనవరి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా పరిధిలోని పెరేడ్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో,వరంగల్ జిల్లా పరిధి ఖిలా వరంగల్ కుష్ మహల్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో జిల్లా కలెక్టర్లు పి ప్రావీణ్య డా.సత్య శారదా చేతుల మీదుగా బల్దియా కు చెందిన అధికారులు ఆదివారం ప్రశంసా పత్రాలు స్వీకరించారు. హనుమకొండ లోని పెరేడ్ గ్రౌండ్లో లో 1.బల్దియా అదనపు కమిషనర్ జోనా 2.ముఖ్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజారెడ్ 3. హార్టికల్చర్ అధికారి రమేష్ 4.డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి వరంగల్ జిల్లా లో

**ప్రశంసా పత్రాలు స్వీకరించిన అధికారులు:**

1.కాశీబుగ్గ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి 2.ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ 3.ఈ ఈ శ్రీనివాస్ 4.సూపరిండెంట్ దేవేందర్ 5.టి పి ఎస్ శ్రీకాంత్ ఏ ఈ లు... 6. రాగి శ్రీకాంత్ 7.సంతోష్ శానిటరీ ఇన్స్పెక్టర్ లు... 8.గోల్కొండ శ్రీనివాస్ 9..సంపత్ రెడ్డి అధికారుల తో పాటు అధికారులు సిబ్బంది ప్రశంసా పత్రాలు స్వీకరించారు.



## ఓయో ఘటన దోషులను కఠినంగా శిక్షించాలి

**ఇబ్రహీంపట్నం జనవరి 26 మహా:** ఈనెల 16న ఓయోలో జరిగిన అత్యాచార ఘటనపై దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం పార్టీ నాయకులు కోరారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఓయోలో ఈనెల 16న మైనర్ బాలిక పై అత్యాచారం జరిగిన విషయంపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రతినిధి బృందం, క్లస్టర్ ఎస్సై రాజుకి వినతి పత్రం అందజేశారు. బాధిత బాలికకు న్యాయం జరిగేలా పోలీసులు చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, ఏఐఎఫ్వైజిల్లా ప్రధాన కార్యదర్శి పి శివకుమార్ గౌడ్, సిపిఐ మున్సిపాలిటీ నాయకులు కాటమ రాజు పల్లపు శివ, ప్రసాద్, శ్రీకాంత్, మహిళా సంఘం మున్సిపాలిటీ అధ్యక్షురాలు వట్టి విజయ, రోజా రాణి, సైదమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులలో ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకే ఈ సహాయ ఉపకరణాల పంపిణీ

- **వారిని ఆత్మగౌరవంతో జీవించేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రథమ లక్ష్యం**
- **మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క**



**ములుగు, మహా :** దివ్యాంగులలో ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకే ఈ సహాయ ఉపకరణాల పంపిణీ అని, వారిని ఆత్మగౌరవంతో జీవించేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రథమ లక్ష్యం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రం లోని గిరిజన భవన్ లో జిల్లా సంక్షేమ అధికారిణిఅధ్యక్షతన దివ్యాంగులకు వివిధ రకాల సహాయ ఉపకరణాలు అందించే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దివ్యాంగులలో ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకే ఈ సహాయ ఉపకరణాల పంపిణీ చేయడం జరుగుతుందని, వారిని ఆత్మగౌరవంతో జీవించేలా: చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రథమ లక్ష్యం అని, అందులో భాగంగానే మన ములుగు జిల్లాలోని దివ్యాంగులకు గతం లో 4 చోట్ల ప్రత్యేకమైన శిబిరాలను నిర్వహించి దరఖాస్తులను స్వీకరించి అందులో నుండి అర్హులను ఎంపిక చేయడం జరిగిందని, ఈ అర్హులైన దివ్యాంగులకు అలింకో సంస్థ సహకారంతో సహాయ ఉపకరణాలను అందించడం జరుగుతుందని అన్నారు. ఈ సహాయ ఉపకరణాలను తీసుకున్న లబ్ధిదారులు పునరుత్తేజంతో తమ జీవితాన్ని కొనసాగిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. వైకల్యం అనేది ఏదో



ఒక్క అవయవానికి మాత్రమే ఉంటుంది. కాబట్టి వైకల్యం ఉన్న అవయవాన్ని గురించి వేదనకు గురికాకుండా ఆరోగ్యంగా ఉన్న మిగతా అవయవాలతో ధైర్యంగా ముందుకు వెళ్ళే ప్రయత్నం చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అందులో భాగంగానే వారికి ప్రభుత్వ/ప్రైవేట్ ఉద్యోగ అవకాశాల కోసం ప్రత్యేకంగా ఒక వెబ్ సైట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, వారికి వివిధ రకాలుగా ప్రోత్సాహకాలు, అందించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల కోసం వారు ప్రయాణించే బ్యాటరీ వాహనాలకే వారు చిరు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా ఒక డబ్బా తో కూడిన ఏర్పాటు తో ప్రత్యేకంగా వాహనాలను రూపొందించడం జరుగుతుందని, త్వరలోనే ఆ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. దివ్యాంగులు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సేవలను వివియోగించుకోవాలని సూచించారు.

## పద్మశాలి సంఘం బైక్ ర్యాలీ

**ఈ చైతన్య యాత్రను జండా ఊపి ప్రారంభించిన ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి**



**మేడిపల్లి, మహా:** ఉప్పల్, చిల్కనగర్, బీరప్పగడ్డ పద్మశాలిల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 తేదిన జరిగే మార్కండేయ జయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలని గణతంత్ర దినోత్సవన్ని పురస్కరించుకొని ప్రతి, కుల బందువులకు మన బలాన్ని బలగాన్ని పరిచయం చేస్తూ ఉప్పల్ రామాలయం నుండి చిల్కనగర్ మార్కండేయ దేవాలయం వరకు గడప గడపకు చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాశికంటి నాగరాజు, సామల కృష్ణ, యెన్నం రాజేందర్, సామల నాగరాజు, సకినాల ప్రసాద్, బెజ్జం శ్రీనివాస్, బాలచందర్, రేణుకా, చంద్రిక, కదువేరు మహేందర్, ఏదెల్లి నరేష్, గుల్లపాలి నాగరాజు, లోకానాదం, మల్లేష్, చంద్రం, కాంగ్రెస్ నాయకులు సల్ల ప్రభాకర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని

**జాతీయ పతాకావిష్కరణ చేసిన కార్పొరేటర్ భూక్య సుమన్**




**మేడిపల్లి, జనవరి 26, మహా:** బోడుప్పల్ నగరపాలక సంస్థ కార్యాలయం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కమిషనర్ రామలింగం, పార్టీ అధ్యక్షులు పోగుల నరసింహారెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కార్పొరేటర్లు, అధికారులతో పాటుగా 21 డివిజన్ కార్పొరేటర్ భూక్య సుమన్ పాల్గొన్నారు. తదనంతరం 21 డివిజన్లోని అన్ని కాలనీల్లో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయపతాక ఆవిష్కరణ చేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ కార్యక్రమాల్లో డివిజన్ సీనియర్ నాయకులు, అధికారులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాల స్టూడెంట్ సూసైడ్

**ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఇంటర్ స్టూడెంట్**

**ఎల్బీనగర్, జనవరి 26, మహా:** అనుమానాస్పద స్థితిలో తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సాయంత్రం హయత్ నగర్ పోలీస్టేషన్ పరిధిలోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో చోటుచేసుకుంది.బాధిత బంధువులు ,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లా కొండనాగుల మండలం అంబగిరి గ్రామానికి కు చెందిన సౌమ్య(17) హయత్ నగర్ లోని కుంట్లూర్ రోడ్డులో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుంది. కాగా ఆదివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో విద్యార్థినులందరూ భోజనానికి వెళ్లగా సౌమ్య తన రూమ్ లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన హాస్టల్ వార్డెన్ తోపాటు విద్యారులు సౌమ్యను వెంటనే వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. విద్యార్థి ఆత్మహత్యపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.మృతురాలి బంధువులు మాత్రం హాస్టల్ లోనున్న అధికారుల వేదింపులే కారణమని ఆరోపించారు. ఈ ఘటనలో హాస్టల్ ప్రిన్సిపాల్ విషయాన్ని బయటకు తెలియకుండా కప్పిపుచ్చుతున్నారు.

## ప్రజాపాలనలో విద్యకు పెద్దపీట

**కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్ రెడ్డి**



**అబ్దుల్లాపూర్ మెట్, జనవరి 26,మహా:** కాంగ్రెస్ పార్టీ విద్యకు పెద్దపేట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. 76 వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అనాజ్ పూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులకు సిఎంఆర్ ఫౌండేషన్ నుంచి స్టడీ మెటీరియల్ ను చిలుక మధుసూదన్ రెడ్డి లాస్య విద్యార్థులకు అందజేశారు. అనంతరం చిలక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యకు పెద్దపీట వేస్తుందని అన్నారు. స్వాతంత్రం తెచ్చిపెట్టిన మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. మనల్ని కన్న తల్లి తండ్రులకు మంచి పేరు తేవాలి.. చదువు నేర్పిన గురువుల వద్ద సంస్కారం నేర్చుకోవాలిప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు మరింత ప్రోత్సాహం చేస్తానన్నాడు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి వస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల బృందం తో పాటు గ్రామ పెద్దలు..తల్లి తండ్రులు... యువజన సంఘాల నాయకులు..విద్యార్థిని..విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆంబులెన్స్ ను ప్రారంభించిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** సోషల్ వెల్ఫేర్ హాస్టల్ రిటైర్డ్ వార్డెన్ శంకర్ రావు వాఘ్మరే కుమారుడు అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు భీమ్ రావు వాఘ్మరే ఏర్పాటు చేసిన నూతన అంబులెన్సు వాహనాన్ని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌక్ లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి భీమ్ రావును అభినందించారు. కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన కలగడం చాలా మంచిదన్నారు.మున్ముందు మరిన్నిసేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, బుద్ధ మహా సభ రాష్ట్ర అధ్యక్షులు రత్నజాడే ప్రజ్ఞ కుమార్,మాదిగ జేఏసీ రాష్ట్ర ఉప అధ్యక్షులు నక్క రాందాస్,మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోతె భారిక్ రావు, మాజీ ఎంపీటీసీ బిక్కి గంగాధర్,నాయకులు పత్తి ముజ్జు,అల్చిట్టి నాగన్న పోరెడ్డి కిషన్, మొహమ్మద్ రఫీక్,సంజీవ్ రెడ్డి,సార్ల సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా భవన్ పై జాతీయ జెండా ఆవిష్కరణ

**అర్హులైన పేదలకు పథకాలు అమలు**



ఇబ్రహీంపట్నం, జనవరి 26, మహా: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజా భవన్ పై జాతీయ జెండాను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండలం, కప్పపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని, అర్హులైన పేద ప్రజలకు రేషన్ కార్డు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.